నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

సంపుటి : 13 సంచిక : 66 రంగారెడ్డి | శుక్రవారం 03 జులై 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 03-07-2026 | Friday | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada




# జపాన్ ప్రధానిని కొనియాడిన మోదీ




**ఢిల్లీ: నిర్భయవార్త :** దేశ రాజధాని ఢిల్లీలో నిన్న ఇండో-జపాన్ సమ్మిట్ జరిగిన సంగతి తెలిసిందే. కాగా ఈ సమావేశంలో జపాన్ ప్రధాని సనే తకైచిని తన చిన్న సోదరితో పోల్చారు భారత ప్రధాని నరేంద్ర మోడీ. గురువారం ఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్-జపాన్ వార్షిక సమ్మిట్ విజయవంతంగా ముగిసింది. ముఖ్యంగా, జపాన్ చరిత్రలోనే తొలి మహిళా ప్రధానమంత్రిగా సరికొత్త రికార్డు సృష్టించిన సనే తకైచి భారత పర్యటనకు రావడం ఇదే తొలిసారి కావడంతో.. భారత ప్రధాని నరేంద్ర మోడీ తకైచి పట్ల ఆత్మీయత కనబరచడం ఇరు దేశాల మధ్య బలమైన సాంస్కృతిక, వ్యూహాత్మక బంధాలకు బాటలు వేసింది. సమ్మిట్ ప్రారంభంలో ప్రధాని మోడీ ఆమెను "మై చోటీ బెహన్" అని సంబోధించడంతో తకైచి మోహంలో నవ్వులు విరిశాయి. ఇక ఈ సమ్మిట్ కేవలం మాటలకే పరిమితం కాకుండా, అత్యంత ప్రతిష్టాత్మకమైన ఒప్పందాలకు వేదికగా నిలిచింది. డిఫెన్స్ కో-డెవలప్‌మెంట్ ఒప్పందం ప్రకారం.. ఇరు దేశాలు మధ్య ఇప్పటివరకు కేవలం సైనిక విన్యాసాలు, రక్షణ సామగ్రి కొనుగోళ్లకే పరిమితం కాగా ఇప్పుడు అత్యాధునిక రక్షణ సాంకేతికతను కలిసి తయారు చేసుకునే ఈ ఒప్పందం రక్షణరంగంలో మైలురాయిగా నిలిచి పోనుంది. దీనితో పాటు గ్లోబల్ సప్లై చైన్ స్థిరత్వం కోసం ఆర్థిక భద్రత, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ల రంగంలో పరస్పర సహకారం, పెట్టుబడుల పెంపుపై ఇరు దేశాలు అత్యంత కీలకమైన ఒప్పందాలు చేసుకున్నాయి. ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ముఖ్యంగా **(మిగతా 3 లో..)**

# లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి టెండర్లు

## పేదోడి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం..: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. గురువారం ఆయన నగరంలో మీడియాతో మాట్లా డుతూ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లుగా ప్రకటించారు. అయితే, ఈ భారీ హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన ఏర్పాట్లపై కేబినెట్ భేటీకి ముందుకు మంత్రి పొంగులేటి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లక్ష ఇళ్లకు అవసరమైన స్థల సేకరణ ప్రక్రియ మరో రెండు, మూడు రోజుల్లోనే పూర్తిగా ముగుస్తుందని స్పష్టం చేశారు.




**పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం..**

నగర పరిధిలోని మొత్తం 19 నియోజకవర్గాల్లో తొలుత పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లుగా మంత్రి పొంగులేటి తెలిపారు. ఫేజ్-1లో భాగంగా ప్రతి నియోజకవర్గంలో కనీసం 500 నుంచి 1000 ఇళ్ల చొప్పున నిర్మాణ పనులను మొదలుపెడతామని అన్నారు. ఆ తర్వాత వచ్చే రెండు, మూడు విడతల్లో మిగిలిన ఇళ్లను కూడా మంజూరు చేసి, లబ్ధిదారులకు అందజేస్తామని, పేదోడి సొంతింటి కలను నెరవేర్చడమే తమ ముందు ఉన్న లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# ఉపాధికి సమీపంలోనే పేదలకు గృహాలు నిర్మిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం జాంబాగ్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మొహమ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు రాజా సింగ్, నవీన్ యాదవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 184 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలతో పాటు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. **(మిగతా 3 లో..)**

# పేదల ఇళ్లనే కూలుస్తోన్న హైడ్రా, జీహెచ్ఎంసీ

## తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం




**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:** చెరువుల ఆక్రమణ, ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల నిర్మూలనకు పుట్టుకొచ్చిన హైడ్రా, జీహెచ్ఎంసీతో కలిసి కేవలం పేదల ఇళ్లను మాత్రమే కూల్చుతోందని తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గురువారం తార్నాకలోని ఎర్రకుంట ఆక్రమణలపై సీనియర్ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది.అయితే, ఈ సందర్భంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రకుంట చెరువు క్రమక్రమంగా ఆక్రమణలకు గురవుతూనే వస్తుందని పిటిషనర్ కోర్టుకు విన్నవించారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, హైడ్రా, లేక్ ప్రొటెక్షన్ కమిటీకి ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పిటిషనర్ తన వాదనలు పకడ్బందీగా వివరించారు.

**(మిగతా 3 లో..)**

# నీట్, జేఈఈలో భారీ మార్పులు..?

## 50% వెయిటేజీ..?



**ఢిల్లీ:నిర్భయవార్త :** దేశంలో కీలక ప్రవేశ పరీక్షలైన నీట్, జేఈఈల్లో భారీ మార్పులు తీసుకురాబోతున్నట్టు సమాచారం. కేవలం ప్రవేశ పరీక్షల మార్కులే కాకుండా బోర్డు పరీక్షల మార్కుల్లో గణనీయమైన వెయిటేజీ కల్పించే దిశగా కసరత్తులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది నుంచి నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షల మార్కులు, ఆయా బోర్డు పరీక్షల మార్కుల వెయిటేజీ 50-50గా మార్చనున్నట్టు కేంద్ర విద్యాశాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. ఇటీవలి కాలంలో నీట్, జేఈఈ వంటి పరీక్షల్లో వచ్చిన లీకేజీ వివాదాలు, వాల్యుయేషన్ లోపాల నేపథ్యంలో విద్యా వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన 9 మంది సభ్యుల కమిటీ ఈ సిఫార్సులను పరిశీలిస్తోంది. ప్రవేశ పరీక్షలను మరింత పారదర్శకంగా మార్చేందుకు కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాదు.. అయితే కేవలం ఎంట్రెన్స్ పరీక్షల కోసమే విద్యార్థులు లక్షల రూపాయలు కుమ్మరించి, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగడం, వాటి వల్ల కలిగే మానసిక ఒత్తిడిని తగ్గించడం కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు. త్వరలోనే దీనిపై కేంద్ర ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్




నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:


రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార,

**(మిగతా 3 లో..)**

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది 'బిగ్ బాస్' డ్రామా..

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరు పార్టీల వైఖరిని ఎండగడుతూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు, ప్రతి విమర్శలు చూస్తుంటే పాపులర్ రియాలిటీ షో 'బిగ్ బాస్ ను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. వారం ముందే రిహార్సల్ చేసుకుని మరీ ఇరు పార్టీల నేతలు పోటాపోటీగా నటనలో జీవిస్తున్నారని, అబద్ధాలు చెప్పడంలో వీరికి ఆస్కార్ అవార్డు ఇస్తే ఇద్దరు దానికి పూర్తిగా అర్హులవుతారని బండి సంజయ్ ఘాటుగా విమర్శించారు. నేతల డ్రామాలను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాలను, అక్రమాలను ప్రజల ముందుంచేందుకు బీజేపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందంటూ కేంద్ర మంత్రి బహిరంగ సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో చర్చకు సంబంధించిన డేట్, టైం, వేదికను తామే ఫిక్స్ చేస్తామని, దమ్ముంటే గురుకులాల టెండర్లు, తెలంగాణను ముంచిన అప్పులు, అవినీతిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. అదే వేదికపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులు, సంక్షేమ పథకాలపై కూడా చర్చించవచ్చని స్పష్టం చేశారు. నాయకులు ఇలాగే డ్రామాలాడితే జనం ఛీ కొట్టడం ఖాయమని హెచ్చరించిన బండి సంజయ్.. ఈ 'రాజకీయ బిగ్ బాస్ షో'లో ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' ఖరారు చేశారని, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్ సర్కార్' రావాలని ఆకాంక్షిస్తున్నారని తేల్చిచెప్పారు.

# ఇక ప్రభుత్వ టీచర్లు, సిబ్బందికి ఉచిత భోజనం

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:



సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన తెలంగాణ తొలి 'ఈ-కేబినెట్' భేటీలో విద్యా రంగానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం, కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతోంది. అయితే, ఇకపై పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులతో పాటు రోజంతా విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి కూడా ఈ ఉచిత భోజన సదుపాయాన్ని విస్తరించాలని కేబినెట్ తీర్మానించింది. తాగాజ నిర్ణయంతో విద్యాసంస్థల్లో నాణ్యమైన సమయం గడపడానికి, టీచర్లు సకాలంలో అందుబాటులో ఉండటానికి మరింత వీలు కలుగుతుందని సర్కార్ భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్భయవార్త

సంపాదకీయం


శుక్రవారం 03 జులై 2026

# అధ్యాపకుల కొరత!

మన దేశ అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిలు)ల్లో దాదాపు నలభై శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండటం ఆందోళనకరం. 'విశ్వగురు', 'ఆత్మనిర్భర్ భారత్', 'ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ' వంటి నినాదాలు నిరంతరం వల్లె వేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఈ వెలితి పట్టకపోవడం శోచనీయం. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్, అంతరిక్ష పరిశోధన, రక్షణ సాంకేతికత వంటి రంగాల్లో ప్రపంచ నాయకత్వం వహించాలని ఘనంగా ప్రకటించడంతోనే సరిపోతుందా? ఆ లక్ష్యాలన్నింటికీ పునాదిగా నిలవాల్సిన ఐఐటిలు అధ్యాపకుల కొరతతో, పరిశోధన వనరుల కొరతతో ఇబ్బందులు పడుతుంటే నినాదాల వల్ల ప్రయోజనం ఏమిటి?స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణంలో విజ్ఞానానికే ప్రధాన ప్రాధాన్యం ఇవ్వాలన్న దూరదృష్టితో అప్పటి పాలకులు ఐఐటిల స్థాపనకు శ్రీకారం చుట్టారు. అవి కేవలం డిగ్రీలు ఇచ్చే విద్యాసంస్థలు కాదు; దేశ శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధికి పునాదులు. నేడు దేశంలో 23 ఐఐటిలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారత మేధస్సుకు ప్రతీకగా నిలిచిన చరిత్ర వాటిది. అలాంటి ప్రతిష్ఠాత్మక వ్యవస్థ బలహీనపడుతోందని చెప్పడానికి ఏళ్ల తరబడి కొనసాగుతున్న అధ్యాపకుల కొరతే పెద్ద నిదర్శనం. అధికారిక గణాంకాల ప్రకారం 23 ఐఐటిల్లో మొత్తం 12,198 అధ్యాపక పోస్టులు ఉండగా, 7,558 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 4,640 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే 38.04 శాతం పోస్టులు భర్తీ కాలేదు. ప్రభుత్వ విద్యావ్యవస్థ, అందునా అత్యున్నత శాస్త్ర, సాంకేతిక విద్యాసంస్థల నిర్వహణను నీరుగార్చి, ప్రైవేటు విద్యాసంస్థలకు, విదేశీ విశ్వవిద్యాలయాలకు, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు చేకూర్చే దుర్బుద్ధితోనే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తుందన్న విమర్శ సత్యదూరం కాదు. ఐఐటిలో అధ్యాపకులుగా నియామకం కావాలంటే – పిహెచ్ డితో పాటు అంతర్జాతీయ స్థాయి పరిశోధన, ప్రతిష్ఠాత్మక జర్నల్లలో ప్రచురణలు, పోస్ట్‌డాక్టోరల్ అనుభవం వంటి అర్హతలు ఉండాలి. అలాంటి ప్రతిభావంతులైన పరిశోధకులకు విదేశీ విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి పరిశోధనా సంస్థలు మరింత ఆకర్షణీయమైన అవకాశాలను కల్పిస్తున్నాయి. దేశంలో పరిశోధన నిధులు, ఆధునిక ప్రయోగశాలలు, దీర్ఘకాలిక పరిశోధనకు అవసరమైన వాతావరణం తగినంత లేకపోవటం వల్ల ఐఐటిల్లోనే పిహెచ్ డి చేసిన యువ శాస్త్రవేత్తలు కూడా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఈ మేధో వలసను అరికట్టకుండా అధ్యాపకుల కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదు. ప్రపంచస్థాయి సాంకేతిక విద్యకు ఒక అధ్యాపకుడికి పది మంది విద్యార్థులు ఉండే నిష్పత్తిని ఆదర్శంగా పరిగణిస్తారు. కానీ ప్రస్తుతం అనేక ఐఐటిల్లో అది 1:16 నుంచి 1:18 వరకు ఉంది. అంటే ఒక అధ్యాపకుడు దాదాపు రెట్టింపు విద్యార్థులకు బోధించడమే కాకుండా, పరిశోధన, పిహెచ్ డి విద్యార్థుల పర్యవేక్షణ, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, పరిపాలనా బాధ్యతలు కూడా నిర్వర్తించాల్సి వస్తోంది. అయినప్పటికీ ఐఐటిల్లో ఏటా 35 వేల నుంచి 40 వేల మంది విద్యార్థులు పట్టభద్రులవుతున్నారు. పాత ఐఐటిల్లో ప్లేస్‌మెంట్లు 80 నుంచి 95 శాతం వరకు ఉంటున్నాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కూడా అవి గౌరవప్రదమైన స్థానాలను నిలబెట్టుకున్నాయి. ఈ విజయాల వెనుక ఉన్న అధ్యాపకులు మోస్తున్న అదనపు భారం ఎంత పెద్దదో ఈ గణాంకాలే తెలియజేస్తున్నాయి. 1990ల తర్వాత అమలైన నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావం ఉన్నత విద్యపై పడింది. స్వయం సమృద్ధి పేరుతో విద్యాసంస్థలు తమ వనరులు తామే సమకూర్చుకోవాలనే ఒత్తిడి పెరిగింది. పరిశోధనను దీర్ఘకాలిక పెట్టుబడిగా కాకుండా తక్షణ ఫలితాల కోణంలో చూడడం ప్రారంభమైంది. కొత్త ఐఐటిలను ప్రారంభించినా, వాటిని నడిపించే శాశ్వత అధ్యాపక వ్యవస్థను బలోపేతం చేయడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదు. కాంట్రాక్టు, విజిటింగ్ అధ్యాపకులతో కాలం నెట్టేసే ధోరణి దీర్ఘకాలిక ప్రయోజనాలకు, విద్యా ప్రమాణాలకు విఘాతం కలిగిస్తుంది. భారతదేశం ప్రపంచ మేధోశక్తిగా ఎదగాలంటే ముందుగా తన మేధో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి. శాశ్వత అధ్యాపక నియామకాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. పరిశోధనలకు నిధులు గణనీయంగా పెంచాలి. యువ శాస్త్రవేత్తలకు ప్రపంచస్థాయి పరిశోధన వాతావరణాన్ని కల్పించాలి. ఐఐటిల్లో కాంట్రాక్టు, విజిటింగ్, అడ్జంక్ట్ అధ్యాపకులపై పూర్తి సమాచారాన్ని బహిర్గతం చేయాలి.

# మనను మైమరిపించే మధుర మామిడి

కరుణామయుడు అయిన భగవంతుడు కనికరం లేని వేసవి కాలాన్ని ఎందుకు సృష్టించాడు? ఇదొక చిక్కు ప్రశ్న. నాకు తెలిసిన ఒకే ఒక్క సమాధానం : మామిడి పండు. ఈ పండ్లను మధురమూ, రసప్లావితమూ చేసేందుకు భగవంతుడు ఈ లోకం పైకి వేడిని వర్షించాడు. ప్రస్తుత రాజకీయ సందిగ్ధావస్థకు సమాధానం కూడా మామిడి పండ్లే సుమా! బంగాళాఖాతం నుంచి అరేబియా సముద్రం దాకా దేశవ్యాప్తంగా ప్రబలంగా వీస్తున్న రాజకీయ చండమారుతాల ఉధృతిని తట్టుకునేందుకు ఏమి చేయాలి? మధుర మామిడి పండ్లు ఆస్వాదించడమే కాదూ? మీకు వీలైతే ఆ ఫలరాజాల గురించి కూడా చదవండి.గత వారాంతంలో నేను అదే చేశాను. నా స్నేహితుడు ఫాహీమ్ ఖాన్ తోట నుంచి నేరుగా పంపిన మధురాతి మధురమైన మామిడి పండ్లను ఆబగా ఆస్వాదించాను. నా మరో స్నేహితుడు సోపాన్ జోషి అద్భుత రచన 'మాంగిఫెరా ఇండికా: ఎ బయోగ్రఫీ ఆఫ్ మ్యాంగో' విశేష ఆసక్తితో చదివాను. 'ఇంగ్లీష్ వారికి వాతావరణం ఎలాగో భారతీయులకు మామిడి పండ్లు అలాంటివి' అని జోషి నొక్కి చెప్పారు. ఆయన ఇంకా ఇలా రాశారు: 'ఆ మధుర ఫలం గురించి మనం ఎంత ఎక్కువగా మాట్లాడితే అది అంత ఎక్కువగా మనకు దర్పణం అవుతుంది. జనులు మామిడి పండు గురించి మాట్లాడినప్పుడు అంతిమంగా తమ వ్యక్తిగత మూలాలను, అభిరుచులను, ప్రాంతీయ వారసత్వాన్ని వెల్లడిస్తారు. మన మామిడి పండ్లు మనలను నిర్వచిస్తాయి'.సరే మామిడి పండ్ల విషయంలో నా పక్షపాతాల గురించి కూడా మనసు విప్పుతాను. నేను పుట్టిన హర్యానా ప్రాంతమూ, నేను పెరిగిన రాజస్థాన్ ప్రాంతమూ మామిడి పండ్లకు ప్రసిద్ధమైనవి కావు. కనుక మామిళ్లలో ఉత్తమమైనవి ఏవి అనే విషయమై చర్చలో నన్ను నేను తటస్థ తీర్పరిగా భావించుకుంటున్నాను. అల్ఫోన్సో మామిడి పండు రుచిలో పరిపూర్ణమైనది కానప్పటికీ అధికధర పొందుతున్నదని నేను విశ్వసిస్తున్నాను. ఆ ప్రకారం చూస్తే, అఖిల భారత అల్ఫోన్సో వ్యతిరేక సంఘానికి నేను జీవితకాల అధ్యక్షుడిని. రెండో సభ్యుడు చేరిక కోసం ఇంకా నిరీక్షిస్తున్నాను. సఫైదా మామిడి పండు వీధి చివర ఉండే పండ్లరసాల దుకాణాలలో వినియోగం కోసం పుట్టిందని నా అభిప్రాయం. దశేరీ మామిడి పండు లతామంగేష్కర్ మధురగానంలా సుమధురమైనది. ఆ గానమూ, ఈ రసాలమూ మనకు సంపూర్ణ సంతృప్తినిస్తాయి. లంగ్డా రుచి గీతాదత్ గానం వలే శ్రేష్ఠమైనది, ఉల్లాసాన్నిచ్చేది, సందేహం లేదు. చౌసాకు సాటివచ్చే మామిడి పండు మరేదీ లేదు. చౌసా మాధుర్యాన్ని వర్ణించేందుకు ఎటువంటి ఉపమ అవసరం లేదు. ఆ పేరే దివ్యమైనది.నా స్నేహితుడు పంపిన మధుర ఫలాలను ఆస్వాదిస్తూ ఆయా మామిడి పండ్ల గురించి పునరాలోచించడం ప్రారంభించాను. ఇంతకు ముందు గులాబ్ జామ్‌ను నేను ఎందుకు రుచి చూడలేదని నాలో నేను ఆశ్చర్యపోయాను. మామిళ్ల గురించిన ఈ చర్చని హఠాత్తుగా మిఠాయిల వైపు మార్చుతున్నానని మీరు పొరపడకండి. నేను మామిళ్లలో రకాల గురించే మాట్లాడుతున్నాను. ఏటా మూడు నెలల పాటు మే 18 నుంచి ఆగస్టు 15 దాకా నా ఆలోచనలన్నీ వాటిచుట్టూనే తిరుగుతూంటాయి. నిర్దిష్ట తేదీలను ఎందుకు చెప్పానని మీరు తెలుసుకోవాలనుకుంటున్నారా? మా మొదటి బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పుడు డాక్టర్ సూచన మేరకు జెస్టేషనల్ డయాబెటిస్ కారణంగా మామిడి పండ్లను తినడం నిలిపివేశాము. కఠినమైన ఆహార నియమమది. ప్రసవం తరువాత ఆ ఆహార నియమాల నుంచి విముక్తి లభించింది. ఆ ఆనందాన్ని మామిడి పండ్ల విందుతో వేడుక చేసుకున్నాం ఆ వేడుక ఆచారం క్రమంగా ఏటా జరిగే సంప్రదాయంగా పరిణమించింది.సరే, మళ్లీ గులాబ్ జామున్ విషయానికి వస్తాను. అది ఒక చిన్న, ఆకుపచ్చని వర్ణంలో ఉండే మామిడి పండు. లంగ్డా అని పొరపడేందుకు అవకాశమూ ఉన్నది. రుచి, రూపంలో దానికంటే మిన్న అయినది, సందేహం లేదు. దానిపై మీరు చాకును ఉపయోగించనవసరం లేదు. తోలు తీసేసి నోట్లో పెట్టుకుని జుర్రుకోవచ్చు. ఐదు శతాబ్దాల క్రితం మొగల్ సామ్రాజ్య స్థాపకుడు బాబర్ తన ఆత్మకథలో గులాబ్ జామున్ ఆస్వాదించడం గురించి అలానే రాశాడు. ఢిల్లీకి సమీపంలోనే గులాబ్ జామున్ మామిళ్లను ఇచ్చే మామిడి తోటలు ఉన్నాయి.. షాజహాన్ చక్రవర్తికి విశ్వసనీయుడు అయిన అధికారి ఒకరు మీరట్‌కు సమీపంలో స్థిరపడిన షాజహాన్ పూర్ మొదలైన 16 గ్రామాల్లో ఈ మామిడి పండ్లు లభిస్తాయి. ఢిల్లీకి సమీపంలో ఉన్నప్పటికీ అవి ఢిల్లీలోని మామిడి పండ్ల విపణిలో లభించవు. గులాబ్ జామున్ రైతులు కుటుంబ వినియోగం కోసమే వాటిని పెంచుతారని ఫాహీమ్ ఖాన్ చెప్పాడు. రటౌల్ అనే మరో మధుర మామిడి కూడా ఢిల్లీ సమీప గ్రామాల్లో పెరుగుతుంది. అయితే ఢిల్లీ దుకాణాలలో అది లభ్యంకాదు. బిహార్ నుంచి, ఆ మాటకొస్తే మామిడి పండ్లను కాపుకాయించే మరే రాష్ట్రం నుంచి వచ్చిన స్నేహితుడినైనా అడగండి, బైజు అనే మామిడి పండు గురించి తమ బాల్య స్మృతులను ఏకరవుపెడతారు. ఇప్పుడు ఆ ఫలం తమకు ఎక్కడా లభ్యం కావడం లేదని కూడా చెప్పుతారు.మా కుటుంబానికి సంబంధించి కూడా ఒక ఆసక్తికరమైన విషయాన్ని తెలియచేస్తాను. మా అమ్మగారు తన బాల్యాన్ని అలహాబాద్‌లో మామిడి పళ్ల మధ్యనే గడిపారు. వివాహానంతరం మా నాన్నతో కలిసి ఆమె మళ్ళీ అలహాబాద్‌కు వెళ్లినప్పుడు బంధువులు తరిగిన మామిడిపళ్ళ ముక్కలను ఒక ప్లేట్‌లో పెట్టి ఇచ్చారట. మా అమ్మకు ఒక్కసారిగా ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. కానీ, ఆ ముక్కలను ఎలా తినాలో ఆమెకు తెలియలేదు. దీన్నిబట్టి మామిడిపండ్లతో మన సంబంధంలో ఎటువంటి మార్పులు సంభవించాయో విశదమవుతుంది. మామిడి పండ్ల గాథలో చాలా మార్పులు సంభవించాయి. రసాల కంటే ముక్కలుగా కోసుకుని తినే కాయలకు ప్రాధాన్యం పెరిగింది. అలాగే చాలాకాలం నిల్వ ఉండేకాయలకు ప్రాధాన్యం పెరిగింది. రుచి కంటే రూపం ఎక్కువైపోయింది. రైతుల కంటే వ్యాపారుల మాటకే మన్నన లభించడం ఆరంభమయింది. ఆధునిక మార్కెట్లు ఉత్పత్తిని, వినియోగదారులను ఎలా మార్చివేశాయన్న దానికి మామిడిపండ్ల గాథే సరైన తార్కాణం.జోషి తన పుస్తక రచనకు లోతైన, విస్తృత పరిశోధన చేశారు. దేశవ్యాప్తంగా మామిడి తోటల సాగుదారులు, మామిడి పండ్ల విక్రయదారులు, ఆ మధుర ఫలాలను ఆస్వాదించేవారు వెల్లడించిన ఆసక్తికరమైన విషయాలతో మామిడి గాథను జోషి అందంగా హృద్యంగా రాశారు. ఆయన కేవలం లక్నో, బెనారస్ కొంకణ్‌కే కాకుండా దేశవ్యాప్తంగా పర్యటించారు. అన్ని ప్రాంతాల మామిడి పండ్ల రుచిని తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల మామిడి పండ్ల సంస్కృతిని తెలుసుకున్నారు. ఈ అనుభవాలు అన్నీ ఆయన పుస్తకంలో ప్రస్ఫుటమయ్యాయి. మీరూ ఆయనతో పాటు ఆయా ప్రాంతాలతో మమేకమవుతారు.జోషీ ప్రయాణాలన్నీ ఫలప్రదమైనవి కావు. నాకు ప్రియాతి ప్రియమైన చౌసా మామిడి మూలాలు ఏమిటో స్పష్టం కాలేదు. అయితే జోషి ప్రతి ప్రయాణమూ ఒక ఆసక్తికరమైన విశేషాన్ని వెల్లడించింది. ప్రాచీన, ఆధునిక చరిత్ర నుంచి మామిడి పంటకు సంబంధించిన విశేషాలను వివరించారు. మహాత్మాగాంధీ మామిడి పండు 'శాపగ్రస్థ ఫలం' అని ఎందుకు అన్నారో, జైలులో ఉన్న డాక్టర్ రామ్‌మనోహర్ లోహియాకు జవహర్ లాల్ నెహ్రూ మామిడి పండ్లను పంపించడం ఆయనకు, సర్దార్ పటేల్‌కు మధ్య వాగ్వివాదానికి కారణమయిందని జోషీ తెలిపారు. వివిధ వైజ్ఞానిక పరిశోధనాశాలలు, జన్యు, పర్యావరణ, వ్యవసాయశాస్త్ర క్షేత్రాలలో ప్రముఖులైన శాస్త్రవేత్తల గురించి కూడా ఆయన రాశారు. కిరాణా వ్యాపారులు, మధ్య దళారులు, ఎగుమతిదారులతో మాట్లాడి మామిడి పండ్ల ఆర్థిక సత్యాలను వెల్లడించారు. ప్రపంచ మామిడి పండ్ల ఉత్పత్తిలో సగం మన దేశంలోనే జరుగుతోంది. నాణ్యత చూస్తే అద్వితీయమైనది. అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో మన మామిడి పండ్లకు సముచిత ప్రాధాన్యం ఎందుకు లభించడం లేదో జోషి వివరించారు. మన సువిశాల దేశంలోని అన్ని ప్రాంతాలలో లభ్యమయ్యే మామిడి పండ్ల గురించి విపులంగా తెలియజేసిన జోషి పుస్తకం నా లాంటి మూర్ఖపు మామిడి జాతీయవాదులకు కనువిప్పు కలిగించేది. మతోన్మాదం, దౌర్జన్యవాదం బుసలు కొడుతున్న ఈ రాజకీయ వేసవిలో జోషి పుస్తకాన్ని చదవడం ఆలోచింప చేసే, ఉపశమనం కలిగించే పఠనానుభవమే.




**యోగేంద్ర యాదవ్**

# రూపాయిని ఇలా ఎంతకాలం నిలబెట్టగలరు?

ప్రధాని నరేంద్రమోదీ ఈ మధ్యనే పన్నెండేళ్ళ ఉత్సవాన్ని జరుపుకున్నారు. ఈ పన్నెండేళ్లలో రూపాయి విలువ చాలాసార్లు పడి, మళ్లీ లేవడం జరుగుతోంది. మోదీ మొదటిసారి ప్రధానమంత్రి అయినప్పుడు (మే 2014 నాటికి) అమెరికన్ డాలర్‌తో రూపాయి మారక విలువ 58.3గా ఉండేది. జూన్ 2026 నాటికి అది రూ.94.5 వద్ద ఉంది. రూపాయి మారకపు విలువ పడిపోకుండా ఉండాలంటే, 'విదేశీ మారక ద్రవ్యం' పెరగాలి. ఆ పనిలో ఇప్పుడు భారత ప్రభుత్వమూ, రిజర్వ్ బ్యాంకూ తలమునకలై ఉన్నాయి.దీనికోసం 'ఫుల్లీ యాక్సెస్‌బుల్ రూట్' విధానాన్ని ప్రభుత్వం విస్తృతం చేయబోతోంది. – 15, 30, 40 ఏళ్ల ప్రభుత్వ బాండ్లను విడుదల చేయడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులకు ఇప్పటికే ఉన్న పరిమితులను తొలగించడం, దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5శాతం పన్ను మినహాయింపు, ప్రభుత్వ బాండ్ల విక్రయంపై 20శాతం పన్ను నిలిపివేయడం వంటి సడలింపుల్ని చేపడుతోంది.ఇలా చేస్తే, ఎగుమతులు పెరిగి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు రావడం, ప్రవాస భారతీయుల నుంచి డబ్బు పంపకాలు పెరగడం, విదేశీ రుణాలు లేదా డిపాజిట్లు పెరగడం, దిగుమతులపై ఖర్చు తగ్గడం లాంటివి జరుగుతాయని, ఫలితంగా ఫారెక్స్ పెరిగి, కనీసంగా 30--40 బిలియన్ డాలర్లు వస్తే, రూపాయి బలపడుతుందని ప్రభుత్వ అభిప్రాయం. విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరగడానికి ఇప్పటి వరకూ అన్ని ప్రభుత్వాలు చెబుతున్నవీ, చేస్తున్నవీ ఇవే. జూన్ 16నాటి 'ఆంధ్రజ్యోతి'లో చిదంబరం చెప్పింది కూడా ఇదే. కొన్నిచోట్ల మోదీని ముద్దుగా విమర్శించినా ఈయన కూడా ఆ 'తాను'లో ముక్కే. తాను ఆర్థిక మంత్రిగా ఉన్న 2013లో 'టేపర్ టాంట్రం' అనే ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు ('అమెరికా కేంద్ర బ్యాంక్' వడ్డీ రేట్లు తగ్గించగానే, పెట్టుబడులన్నీ భారత్ వంటి దేశాలకు వెళ్లిపోయి, వడ్డీ రేట్లు కొంచెం పెంచగానే తిరిగి అమెరికాకు చేరినప్పుడు) రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 68కి పడిపోయింది. అప్పుడు ఆయనకు ఆర్థిక సలహాదారు అయిన రఘురామ్ రాజన్ ఎలాంటి సలహాలు ఇచ్చారో, ఇప్పుడు మోదీకి కూడా అనంత నాగేశ్వరన్ అలాంటి సలహాలే ఇస్తున్నారు. ఆ సలహా పేరే-- 'ఫుల్లీ యాక్సెస్ బుల్ రూట్.'ఆర్థిక పరిభాషలో దీన్ని 'హాట్ మనీ ఫ్లో' అంటారు. అంటే– 'స్వల్పకాలిక విదేశీ మూలధన ప్రవాహం'. విదేశీ పెట్టుబడిదారులు తమ తమ లాభాల కోసం ఒక దేశంలోకి వేగంగా తీసుకువచ్చే డబ్బు ఇది. (ఇది ఎంత వేగంగా వస్తుందో, అంతే వేగంగా తిరిగి వెళ్లిపోతుంది.) 1950--60ల నుంచే 'అంతర్జాతీయ ఆర్థిక రంగం'లో ఈ మాట విస్తృతంగా వాడుకలో వచ్చింది. ఇదొక 'ప్రమాదకరమైన ఆర్థిక ధోరణి'. ఇలాంటి ధోరణి వల్లనే 1997లో ఆసియాలో ఆర్థిక సంక్షోభం వచ్చింది. దీని వలన థాయ్‌లాండ్ కరెన్సీ 'తాయ్ బాత్' విలువ కుప్పకూలిపోయింది. విదేశీ పెట్టుబడిదారులు భారీగా డబ్బు వెనక్కి తీసుకోవడం ప్రారంభించారు. ఆ ప్రభావం ఇండోనేసియా, దక్షిణ కొరియా, మలేసియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు కూడా వ్యాపించింది. పెట్టుబడిదారులు లాభాలు కనిపించినంత వరకు డబ్బు పెట్టారు. ప్రమాదం ఉందనిపించగానే ఒకేసారి డబ్బు వెనక్కి తీసుకున్నారు. దీంతో స్థానిక కరెన్సీల విలువలు ఒక్కసారిగా 30 నుంచి 80శాతం వరకు పడిపోయాయి. అనేక కంపెనీలు, బ్యాంకులు దివాలా తీశాయి. నిరుద్యోగం, పేదరికం పెరిగాయి. కొన్ని దేశాలు 'అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ' దగ్గర సహాయం తీసుకోవాల్సిన పరిస్థితిలో పడిపోయాయి."హాట్ మనీ త్వరగా వస్తుంది, కానీ భయం కలిగితే అంతే త్వరగా పారిపోతుంది. కాబట్టి దానిపై ఎక్కువ ఆధారపడకూడదు" అని టర్కీ ఆర్థికవేత్త డాని రాడ్రిక్ చెప్పారు. "ప్రతీ దేశం తన అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా ఆర్థిక విధానాలను రూపొందించుకోవాలి. విదేశీ మూలధనం, స్వేచ్ఛా వాణిజ్యం ఉపయోగకరమే. కానీ వాటికి పరిమితులు ఉండాలి. ఆర్థిక మార్కెట్లను పూర్తిగా తెరవడం వల్ల సంక్షోభాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ పరిశ్రమలను, ఉద్యోగాలను రక్షించుకునే విధానాలకు అవకాశం ఉంచాలి. అలాగే– 'ఆ డబ్బును విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల మీదా, పారిశ్రామికీకరణ మీదా ఉపయోగించకుండా తక్కువ వడ్డీ వచ్చే విదేశీ ఆస్తుల్లో ఉంచడం న్యాయం అనిపించుకోదు' అన్నారు



**నన్నూరి వేణుగోపాల్**

# ఉపాధికి సమీపంలోనే పేదలకు గృహాలు నిర్మిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మహానగరంలోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, టెండర్ ప్రక్రియ అనంతరం దశలవారీగా పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. లబ్ధిదారులు ఉపాధికి దూరం కాకుండా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి గృహాలను నిర్మిస్తామని తెలిపారు. పైలట్ ప్రాతిపదికన కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందజేస్తామని వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడవే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లో కొత్త ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నామని, లబ్ధిదారులు జీవనోపాధికి సమీపంలోనే గృహాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధూల్‌పేట్ ప్రాంతంలోని సంప్రదాయ విగ్రహ తయారీదారుల జీవనోపాధికి అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మొహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ సొంతింటి పట్టా, ఇంటి తాళాలు అందుకోవడం ప్రతి కుటుంబానికి ఒక కల అని పేర్కొంటూ, లబ్ధిదారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ రెండు పడకగదుల ఇల్లు అందించి పేదల కలను సాకారం చేయడంలో ప్రభుత్వం సహకరించిందని, ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్) అశోక్ చక్రవర్తి, నాంపల్లి తహసీల్దార్ నయీమ్ ఉద్దీన్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, గృహనిర్మాణ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ ప్రధానిని కొనియాడిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న ఏకపక్ష చైనా వ్యూహాత్మక కదలికలను సమర్థవంతంగా అడ్డుకోవడానికి ఈ చర్చలు ఎంతో దోహదపడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా క్వాడ్ కూటమిలో కీలక భాగస్వాములుగా ఉన్న భారత్, జపాన్‌లు 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో–పసిఫిక్' సాధన కోసం కట్టుబడి ఉన్నాయని ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి మరోసారి స్పష్టమైన సందేశాన్ని పంపాయి.

# పేదల ఇళ్లనే కూలుస్తోన్న హైడ్రా, జీహెచ్ఎంసీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే ధర్మాసనం కలుగజేసుకుని.. జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వాళ్లు కేవలం పేదోళ్ల ఇళ్ల మీదే పడ్డారని, వాళ్ల ఇళ్లను మాత్రమే టార్గెట్‌గా చేసుకుని కూలుస్తున్నారని వ్యాఖ్యానించింది. ఇలాంటి అసలైన ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీతో పాటు హైడ్రా, నీటి పారుదల శాఖలకు హైకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. కేసులో తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా వేసింది.

# బెంగళూరు, చెన్నైల కంటే హైదరాబాద్‌లోనే నిరుద్యోగం అధికం..



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, చెన్నైలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ తాజా నివేదిక వెల్లడించింది. 46 మిలియన్–ప్లస్ జనాభా గల నగరాలపై జాతీయ గణాంకాల కార్యాలయం (చీూా) జూన్ 30, 2026న విడుదల చేసిన నివేదికలో సంచలన వివరాలు వెల్లడయ్యాయి. 2025 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (గ్రాఖీూ) ఆధారంగా ఈ గణాంకాలను రూపొందించారు.

నివేదికలోని ముఖ్యాంశాలు ఇవే..

హైదరాబాద్‌లో నిరుద్యోగ రేటు 6.8 శాతంగా నమోదు కాగా.. బెంగళూరు (2.8%), చెన్నై (4.4%) మెరుగైన స్థితిలో ఉన్నాయి. దక్షిణాదిలో అత్యధికంగా మధురైలో 11.6%, ఏపీలోని విజయవాడలో 6.9%, విశాఖపట్నంలో 6% నిరుద్యోగం ఉంది. కాగా, దేశవ్యాప్తంగా పాట్నా (20.9%) అగ్రస్థానంలో ఉంది. 46 నగరాల జాతీయ సగటు నిరుద్యోగ రేటు 4.9 శాతంగా ఉంది. సగటు పని గంటల విషయంలో హైదరాబాద్ (వారానికి 49 గంటలు) బెంగళూరు, చెన్నైల కంటే ముందుంది. విజయవాడలో ఇది ఏకంగా 50.1 గంటలుగా ఉంది.

నెలవారీ ఆదాయం.. మహిళల భాగస్వామ్యం

హైదరాబాద్‌లో సగటు నెలవారీ వేతనం రూ. 31,153. ఇది జాతీయ సగటు (రూ. 28,808) కంటే ఎక్కువే అయినప్పటికీ.. బెంగళూరు (రూ. 34,323), ముంబై (రూ. 36,267), ఢిల్లీల కంటే తక్కువగా ఉంది. సర్వే చేసిన 46 నగరాల్లో పురుషుల శ్రామిక శక్తి భాగస్వామ్యం 75.9% ఉండగా, మహిళల భాగస్వామ్యం కేవలం 27.2% గానే ఉంది. చదువు కోసం పురుషులు (53.5%) ఉపాధికి దూరంగా ఉంటుంటే.. ఇంటి పనులు, పిల్లల సంరక్షణ బాధ్యతల వల్లే అత్యధిక శాతం మహిళలు (68.7%) శ్రామిక శక్తికి దూరమవుతున్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మూసారాంబాగ్‌లోని అఫ్జల్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 97 మంది లబ్ధిదారులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. మలక్‌పేట్ నియోజకవర్గంలో ఇంకా గృహాలు అవసరమైన అర్హులైన కుటుంబాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతగా చేపట్టనున్న ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో భాగంగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే ప్రభుత్వ భూములను గుర్తించి గృహాలను నిర్మిస్తామని తెలిపారు. లబ్ధిదారులు తమ ఉపాధికి దూరం కాకుండా వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించడం ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేద కుటుంబాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూముల లభ్యతను పరిశీలిస్తూ, ఉపాధి ఉన్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పునరావాస అవసరాలను కూడా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పరిశీలిస్తోందని తెలిపారు. మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సొంతింటి తాళాలు, పట్టాలు అందుకోవడం వారి కుటుంబాలకు కొత్త జీవితానికి నాంది పలికే సందర్భంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్) అశోక్ చక్రవర్తి, సైదాబాద్ తహసీల్దార్ మణిపాల్, గృహనిర్మాణ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన నాయిని

నిర్భయవార్త ప్రతినిధి :హనుమకొండ :

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 53వ డివిజన్ పరిధిలో లష్కర్ సింగారం, గోపాల్పూర్ జంక్షన్ ప్రాంతాల్లో సుమారు రూ.2.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో డివిజన్‌కు నామమాత్రంగా నిధులు కేటాయించేవారని, ప్రస్తుతం ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి కాలనీకి మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెన్షన్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితాలను డివిజన్ వారీగా తుది దశకు తీసుకొచ్చామని వెల్లడించారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

**ఆ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంపు**




నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి:

ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఈ మేరకు చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డిమాండ్‌పై సానుకూలంగా స్పందించిన కూటమి సర్కార్, వారి పదవీ విరమణ వయస్సును పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకుంది.అయితే, గతంలో సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచినప్పటికీ, కొన్ని టెక్నికల్ కారణాల వల్ల పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ సొసైటీల పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు ఆ బెనిఫిట్ వర్తించలేదు. దీంతో ఈ విషయంలో పలు ఉద్యోగ సంఘాలు నిరంతరం ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందజేస్తూ.. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇవాళ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు ఫైలుపై సంతకం చేశారు. తాజా పరిణామంతో వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

# క్రీడా పోటీల్లో తెలంగాణ TWMS స్కూలు సరికొత్త రికార్డులు



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

అడవి తల్లుల ఒడిలో సహజసిద్ధమైన నైపుణ్యాలతో పెరిగిన గిరిజన బిడ్డలు.. నేడు క్రీడా పోటీల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ వేదికగా అందుతున్న అత్యుత్తమ శిక్షణతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ కీర్తి పతాకాన్ని ఎగరేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన విద్యార్థులలోని క్రీడా నైపుణ్యాలను గుర్తించి, వారిని అంతర్జాతీయ ఛాంపియన్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లను నడుపుతోంది. ఫలితంగా సంప్రదాయ క్రీడల నుంచి ఆధునిక క్రీడల వరకు అన్నింటిలోనూ గిరిజన విద్యార్థులు మేటిగా రాణిస్తున్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, ఫెన్సింగ్, ఆర్చరీ క్రీడల్లో ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్‌లో ట్రైనింగ్ ఇస్తున్నారు.

**వాటర్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్..**

ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్‌లో వాటర్ స్పోర్ట్స్ ప్రత్యేకంగా నిలుస్తోంది. సాధారణంగా ఖరీదైన క్రీడలుగా భావించే కాయాకింగ్, కెనోయింగ్, రోయింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్‌లో గిరిజన విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. హుస్సేన్‌సాగర్ వేదికగా నిపుణులైన కోచ్‌ల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అలలపై అద్భుతాలు చేస్తూ.. వారు సాధిస్తున్న పతకాలు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీంతో ఒకప్పుడు కేవలం గిరిజన తండాలకే పరిమితమైన ఈ పిల్లలు, నేడు జాతీయ స్థాయి ఖేలో ఇండియా, నేషనల్ గేమ్స్‌తో పాటు అంతర్జాతీయ టోర్నమెంట్లలో పతకాలు సాధిస్తూ దేశానికే గర్వకారణంగా మారుతున్నారు.

**7 స్కూల్స్.. 240 మంది స్టూడెంట్స్**

తెలంగాణలో మొత్తం 7 ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయి. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో కాంచనపల్లి (గర్ల్స్), కిన్నెరసాని (బాయ్స్), ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో కొత్తగూడ (బాయ్స్), ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో ఉట్నూరు (బాయ్స్), జాతర్ల (బాయ్స్), ఆసిఫాబాద్ (గర్ల్స్), ప్లేన్ ఐటీడీఏ పరిధిలో హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఉంది. వీటిల్లో క్రీడల్లో శిక్షణ తోపాటు విద్య, వసతి కల్పిస్తున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. 7 స్పోర్ట్స్ స్కూళ్లలో మొత్తం 240 మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. వీరికి స్పెషల్ డైట్ సహా.. అన్నింటినీ ప్రభుత్వమే సమకూరుస్తుంది. వీటిల్లో చదివే విద్యార్థులు అటు క్రీడల్లో, ఇటు పరీక్షల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు.

**పోటీ ఏదైనా పతకం వీరిదే..**

ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ట్రైనింగ్ తీసుకున్న విద్యార్థులు.. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో వందలాది పతకాలు సాధించారు. వాటర్ స్పోర్ట్స్‌లో మొత్తం 458 పతకాలు సాధించారు. ఇంటర్నేషనల్ లెవెల్‌లో 5 (1 సిల్వర్, 4 బ్రౌంజ్) మెడల్స్ సాధించారు. కేవలం 2025–26 విద్యా సంవత్సరంలోనే వివిధ క్రీడా పోటీల్లో నేషనల్ లెవెల్‌లో 145 గోల్డ్, 199 సిల్వర్, 73 బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. వీటిని సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించి, నగదు బహుమతి అందజేశారు. మరిన్ని అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వెళ్లేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

**అప్‌గ్రేడ్ చేయాలి..**

ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రస్తుతం పదో తరగతి వరకే చదువుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇంటర్, డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు ఇలా క్రీడల్లో అత్యుత్తమ శిక్షణ ఇచ్చే విద్యా సంస్థలు లేవు. దీంతో విద్యార్థులు వెనకబడుతున్నారు. అందుకే.. ఈ స్కూళ్లను ఇంటర్, డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని స్టూడెంట్స్ కోరుతున్నారు. అలా చేస్తే.. జూనియర్, సీనియర్ పోటీల్లోనూ పాల్గొనే అవకాశం తమకు వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.

# ఏపికి ఒట్టి చేతులతో రాలేదు: శివరాజ్ సింగ్ చౌహాన్



నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి :

మామిడి రైతులకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తీపి కబురు అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనలో భాగంగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను ఏపీకి ఒట్టి చేతులతో రాలేదని, మేనమామగా ఇక్కడి రైతులకు అండగా ఉంటానని ఆయన ప్రకటించారు. రాష్ట్రంలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

**భారీ ఎత్తున మామిడి సేకరణ**

మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద ఏపీలో భారీ ఎత్తున మామిడి సేకరించనున్నట్లు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. ఈ పథకం ద్వారా దాదాపు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి రకం మామిడి కాయలను సేకరించే ప్రతిపాదనతో తాము ముందుకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ధరల పతనంతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందని శివరాజ్ సింగ్ చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రైతుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. తోతాపురి మామిడి సేకరణ ద్వారా రైతులకు మద్దతు ధర లభించడమే కాకుండా, మార్కెట్‌లో ధరల స్థిరీకరణకు ఈ నిర్ణయం దోహదపడుతుందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

# అమీన్పూర్ లో రూ.17 లక్షల గంజాయి స్వాధీనం



జులై 2(నిర్భయవార్త ) జిల్లా ప్రతినిధి: పటన్ చెరువు అమీన్పూర్ పోలీసులు ప్రత్యేకంగా బృందంతో కలిసి నిర్వహించిన తనిఖీల్లో గురువారం నాడు రూ. 17 లక్షల విలువైన 34.50 కిలోల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు!సుల్తాన్పూర్ వద్ద బొలెరా వాహనంలో తరలిస్తున్న 17 ప్యాకెట్లు పట్టుబడ్డాయి. అందులో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనంచేసుకున్నారు. పరాయిలో ఉన్న ప్రధాన నిందితుల కోసం అమీన్పూర్ పోలీసులు గాలింపులు అతివేగంగా కొనసాగిస్తున్నారు.

# దివంగత నేత గొట్టిముక్కల పద్మారావుకు ఘన నివాళి





దశదిన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

కూకట్పల్లి, జూలై 2 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దివంగత రాజకీయ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు దశదిన కార్యక్రమాన్ని గురువారం వివేకానంద నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. పద్మారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కోసం గొట్టిముక్కల పద్మారావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉద్యమ కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఆయన అంకితభావంతో పనిచేశారని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సేవలు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొని దివంగత నేతకు నివాళులర్పించారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కూతురి వివాహానికి అండగా నిలిచిన కాటా



జులై 2 (నిర్భయవార్త)జిల్లా ప్రతినిధి: జిన్నారం మున్సిపాలిటీ ఉట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన .అన్నారం సాయిలు కుమార్తె వివాహానికి పటాన్ చెరువు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారు 1లక్ష రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. అన్నారం సాయిలు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు మరవలేవని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తుచేసుకున్నారు ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ వైస్ ఎంపీపీ గంగు రమేష్, గుమ్మడిదల కౌన్సిలర్ నరేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ శివరాజ్,మాజీ ఉప సర్పంచ్ రవి, యనగండ్ల నరేందర్, జింకల మధు, నాయకులు, తదిరులు పాల్గొనారు.

# మిషన్ బ్రైట్ కౌకూర్'లో మరో 14 వీధి దీపాలు ఏర్పాటు

## రెడ్డి బస్తీ, హరిజన బస్తీ సహా పలు ప్రాంతాల్లో నూతన లైట్ల ఏర్పాటు -- ప్రజల భద్రతే లక్ష్యమని తుడిమెళ్ల మల్లికార్జున్



కౌకూర్, జూలై 2 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మైనంపల్లి హనుమంత్ రావు నాయకత్వంలో చేపట్టిన "మిషన్ బ్రైట్ కౌకూర్" కార్యక్రమంలో భాగంగా కౌకూర్ పరిధిలో మరో 14 నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ నిరంతర కృషి, అధికారులతో చేసిన ఫాలోఅప్ ఫలితంగా ఈ పనులు పూర్తయ్యాయి.రెడ్డి బస్తీ, హరిజన బస్తీ, భారత్ నగర్, ఫార్చ్యూన్ అవెన్యూ, ప్రశాంత్ విహార్, కౌకూర్ శివాలయం పరిసర ప్రాంతాల్లో ఈ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు భద్రత కూడా పెరగనుంది. ఈ సందర్భంగా తుడిమెళ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ, యాప్రాల్ డివిజన్లో ప్రతి వీధిని వెలుగులతో నింపాలనే లక్ష్యంతో "మిషన్ బ్రైట్ కౌకూర్" కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చీకటి ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట్ల మరిన్ని వీధి దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వీధి దీపాల ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో గుంతల కారణంగా జరిగే ప్రమాదాలు తగ్గడంతో పాటు పాములు, విషపురుగుల వంటి ప్రమాదాల నుంచి ప్రజలకు రక్షణ లభిస్తుందని చెప్పారు. మహిళలు, విద్యార్థులు, వృద్ధులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని పేర్కొన్నారు. "ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తూ, కౌకూర్ను ఆదర్శవంతమైన, వెలుగులతో నిండిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మా ప్రయత్నాలు కొనసాగుతాయి" అని తుడిమెళ్ల మల్లికార్జున్ అన్నారు. వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే స్పందించిన మల్కాజిగిరి జోన్ ఎలక్ట్రికల్ విభాగం డీఈ కవితతో పాటు సంబంధిత సిబ్బందికి తుడిమెళ్ల మల్లికార్జున్ కృతజ్ఞతలు తెలిపారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: భద్రాద్రి కలెక్టర్ అంకిత్


## కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కొత్తగూడెం, జూన్ 3 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన,





సకాలంలో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. గురువారం కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను (అటెండెన్స్ రిజిస్టర్) క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్.. వారి హాజరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.?వార్డుల పరిశీలన.. రోగులతో ముఖాముఖి?అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రసూతి వార్డును సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న మహిళల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా సేవలు అందిస్తున్నట్లు వైద్యులు కలెక్టర్కు వివరించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి ఆయన నేరుగా మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల నాణ్యత, ఉచిత మందుల లభ్యత, అలాగే వైద్యులు, సిబ్బంది యొక్క స్పందన ఎలా ఉందనే విషయాలపై రోగుల నుండి ఫీడ్బ్యాక్ తీసుకున్నారు.



**బాధ్యతారహితంగా ఉంటే సహించేది లేదు..**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే ప్రతి ఒక్కరికీ అంకితభావంతో సేవలు అందించాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు."రోగులతో ఎల్లప్పుడూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి. వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పరిష్కరించాలి. విధులకు గైర్హాజరైనా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు ఉంటాయి." అని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో కలెక్టర్ వెంట హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాధా మోహన్, డివైసిఎస్ఆర్ఎంఓ సీతారాం, ఆర్ఎంఓ చైతన్య, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య తదితర అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## బీఎల్ఓ లు ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

ఖమ్మం, వైరా, జూలై 02 నిర్భయవార్త రిపోర్టర్.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (రా×=) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది కావడంతో ప్రతి వివరాన్ని అత్యంత బాధ్యతతో నమోదు చేయాలని సూచించారు.గురువారం వైరా పట్టణంతో పాటు కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరు, నింపిన ఫారాలను స్వీకరిస్తున్న విధానం, ఓటర్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు ఇళ్లను సందర్శించిన కలెక్టర్ ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను తెలుసుకుని నివృత్తి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రతి బీఎల్ఓ తప్పనిసరిగా బీఎల్ఓ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే వివరాలను నమోదు చేయాలని, సమాచార నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ నిష్పాక్షికంగా, పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు.ప్రతి బీఎల్ఓ రోజువారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాలని, అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారాలు పంపిణీ చేసే సమయంలోనే ఓటర్లకు ఎదురయ్యే సందేహాలు, అపోహలను నివృత్తి చేసి, అవసరమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.



# జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ



జూలై 2 (నిర్భయవార్త)జిల్లా ప్రతినిధి: గుమ్మడిదల మండల ప్రజా పరిషత్ డెవలప్మెంట్ కార్యాలయంలో ఆరో విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా దర్బార్ గురువారం నాడు నిర్వహించారు. డి.ఆర్.డి.ఓ బాలరాజ్, దీప్తి డైరెక్టర్ ఉష, నాగేశ్వరావు హాజరై పనులను క్షుణ్ణంగా పరిశీలించారు! అలాగే ఉపాధి హామీ పనుల వివరాలు సమీక్షించారు. అధికారులు ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్లు తదిరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో పారదర్శకత నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు.

# ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి ఎమ్మెల్సీ

జులై 2(నిర్భయ వార్త) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: రామచంద్రపురం నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ లో ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామక నోటిషికేషన్లను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని అదిలాబాద్,నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి గురువారం నాడు డిమాండ్ చేశారు! అధికారంలోకి వచ్చి వచ్చిన తొలి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, యువతకు హామీ ఇచ్చిన ప్రభుత్వం నేడు హామీలను విస్మరించి నిరుద్యోగులను నిరాశకు గురి చేస్తుందని మండిపడ్డారు



# రాష్ట్రంలోనే తొలి మహిళా సంఘాల సోషల్ ఆడిట్




జులై 2(నిర్భయ వార్త) జిల్లా ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో రాష్ట్రంలోనే తొలి మహిళ సంఘాల సోషల్ ఆడిట్ గురువారం నాడు విజయవంతంగా నిర్వహించారు! కానుకుంటా-2 గ్రామైక్య సంఘ పరిధిలోని 34 మహిళ సంఘాలను పరిశీలించి గ్రామసభలో నివేదిక వెల్లడించారు. అంతర్గత అప్పుల చెల్లింపుల లోపాలను సరిదిద్దుతామని సభ్యులు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఉషారాణి మహిళ సంఘాల పనితీరును ప్రశంసించారు.

# పారిశ్రామికవాడలో కార్మికుల పునర్నియామకం కోసం ఆందోళన

జులై 2 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: పాశమైలారం పారిశ్రామిక వాడలో గల బిస్లరీ పరిశ్రమల తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట గురువారం నాడు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ కార్మికులను తిరిగి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## రాఘవాపురం--కమ్మవారిపాలెం బీటీ రహదారికి శంకుస్థాపన.



నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :నందిగామ మండలం రాఘవాపురం గ్రామం వద్ద ఎన్.జే.రోడ్ నుంచి కమ్మవారి పాలెం రహదారి (వయా రాఘవాపురం)కి కి.మీ. 0.000 నుంచి 1.400, అలాగే కి.మీ. 2.600 నుంచి 3.600 వరకు ఎండీఆర్ (అప్‌గ్రెడేషన్) ప్రణాళిక నిధులతో రూ.34.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రహదారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతి నిధులు,అధికారులతోకలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వంప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల రాకపోకలు సులభతరం చేసేందుకు గ్రామీణరహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రాఘవాపురం, కమ్మవారిపాలెం గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, నందిగామ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం ఉన్న ఫ్రీ రేషన్.



నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :నందిగామ లోని 13, 14, వార్డ్ లో నివసిస్తున్న కొశీత మంది కి ప్రభుత్వ ఉద్యోగం ఉన్నపట్టికి ఫ్రీ రేషన్ తీసుకున్నారు ఇలాంటి వాళ్ళను ప్రభుత్వం సర్వే చేసి తీసివేస్తే లేనివారికి రేషన్ వస్తుంది చాలా మందికి రేషన్ లేక ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వం వెంటనే స్పందిశీచి తగిన అధికారులను నియమించిన ఎంతో మంది కొత్త రేషన్ కార్డ్ అప్లై చేసుకోవటానికి అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు రేషన్ లేనివారికి ఉపయోగం కానీ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున వారికి కాదు ఇది చాలా అన్యాయం అని గ్రామీణ ప్రాంతాల నివాసించే ప్రజలు వాపోతున్నారు.

## కావలిలో దాడికి గురైన గిరిజన మహిళా కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.



నెల్లూరు జిల్లా,కావలి, నిర్భయవార్త ప్రతినిధి : కావలి పట్టణంలోని కచేరిమిట్టలో ఇటీవల దాడికి గురైన గిరిజన మహిళను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో.మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ కుందా రవి, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర తదితరులు బాధితురాలి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను కలసి జరిగిన ఉదంతాన్ని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ అనంతరం మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.గిరిజన మహిళపై జరిగిన దాడి అత్యంత విచారకరమని, సమాజంలో మహిళల, ముఖ్యంగా గిరిజన వర్గాల హక్కులకు, రక్షణకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గిరిజన మహిళలకు దక్కిన రాజకీయ గౌరవాన్ని గుర్తు చేస్తూ, నెల్లూరు జిల్లాలో ఒక గిరిజన మహిళకు మేయర్ పదవిని అందించి గౌరవించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల గౌరవానికి భంగం కలగడం ఆందోళనకరమని అన్నారు.ఈ ఘటనలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ అండగా ఉంటుందని, వారికి పూర్తి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. కావలి నియోజకవర్గంలో శాంతిభద్రతలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, అరాచకాలకు తావులేకుండా చూడాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం తక్షణమే స్పందించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత గిరిజన మహిళకు పూర్తి న్యాయం చేకూరే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా పార్టీ నాయకులు పునరుద్ఘాటించారు.

## విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి**

ఖమ్మం, కొణిజర్ల, జూలై 02 నిర్భయవార్త రిపోర్టర్.ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన



పోషకాహారం అందించాలని, ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు చదువు మీద శ్రద్ధ చూపెడతారనీ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొణిజెర్ల మండలం పల్లిపాడు గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తరగతి గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, వంటగది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం గుడ్డు, వెజిటబుల్ బిర్యానీ, పప్పు, సాంబారు అందిస్తున్నారా,



ఆహారం పరిశుభ్రంగా తయారవుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించాలని, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి తాజా కూరగాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కొణిజెర్ల తహసీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమీషనర్ రామచందర్ రావు, ఎంఈవో చావా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోడు గుండా సీతారామ ప్రాజెక్టు

**సర్వే కోసం సమావేశం**

సింగరేణి జులై 2 నిర్భయవార్త రిపోర్టర్. సీతారామ ప్రాజెక్టు కు భూ సేకరణకు రెవిన్యూ, ఫారెస్టు, ఇరేగేషన్ శాఖల అధికారులు గురువారం కారేపల్లి మండలం పాటిమీదిగుంపులో సర్పంచ్ గుగులోత్ సుజాత సంతోష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో అధికారులు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి రెవిన్యూ భూముల భూ సేకరణ పూర్త చేయటం వారి పరిహారం ఇవ్వటం పూర్తి అయిందని తెలిపారు. ఫారెస్టు భూముల గుండా ప్రాజెక్టు కాలువ వెళ్తుండటం దానిలో పోడు భూములు ఉండటంతో పోడు సాగుదారులతో అధికారులు చర్చించారు. కాలువకు పనులకు సంబంధించి సర్వే పనులు నిర్వహించటానికి సన్నహాలు




జరుగుతున్నాయని వాటికి సహరించాలని కోరారు. కాలువ క్రింద హక్కుపత్రాలు ఉన్న రైతులు ఎందరు, హక్కు లేకుండా సాగులో ఉన్న రైతుల వివరాలను అధికారులు సేకరించారు. సుమారు 30 మంది పోడు రైతుల భూములు సీతారామ ప్రాజెక్టుకు సేకరణకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈసమావేశంలో తహసీల్ధార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బీ.పద్మ, ఆర్ఐ జగదీష్, డీప్యూటి ఎఫ్ఆర్వో, ఇరిగేషన్ డీఈ, జీపీ కార్యదర్శి అశోక్, జీపీవో రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**ఆదివాసి సంక్షేమ పరిషత్**

ములుగు జూలై 02, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్




కి ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలు, ఆదివాసి సమస్యలపై మెమోరాండం అందజేశారు . ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టాలు, ఆదివాసి యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు అమలు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంత ములుగు జిల్లా లో అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు ఏజెన్సీ ప్రాంతంలో 100కు 100% అంగన్వాడీ టీచర్స్, ఆయా పోస్టులు ఆదివాసి మహిళలకు కేటాయించాలని కోరారు. వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ పంచాయతీ లోని ముత్తారం గ్రామంలో రెండు సంవత్సరాల ముత్తారం - 2 అంగన్వాడి కేంద్రం నడుస్తున్నది. ఆ గ్రామంలో 100 కుటుంబాలు కలవు. ఆ గ్రామంలో 16 మంది 0-06 పిల్లలు ఉన్నారు.మొదటి విడత కింద జారీ చేసిన నోటిఫికేషన్ లో ముత్తారం 2 టీచర్ నియామకం లేకపోవడం అక్కడ ఆదివాసి పిల్లలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 1 అనుబంధ పోషకాహారం 2 ప్రీ స్కూల్ విద్య ఐసిడిఎస్ పథకం కింద సేవలందించడం కొరకు ముత్తారం గ్రామంలో అంగన్వాడీ టీచర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు తాటి రాంబాబు, కుంజ సూరిబాబు సోడి గోపి, కాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి మరణానికి ఇసుక మాఫియా కారణం...

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించని లోకేష్.. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆరోపణ...**



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి ;:. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మురళి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడానికి ఇసుక మాఫియా కారణమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి మండలం నారాయణపురం గ్రామానికి వెళ్లి దుర్మరణం చెందిన ఉపాధ్యాయుడు మురళి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక మాఫియా, మట్టి మాఫియా జరుగుతున్నదని, చెన్నైకు అక్రమంగా తరలిస్తున్నా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయని, కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఇటీవల తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో 30 ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేయగా 20 ట్రాక్టర్లకు మాత్రమే నామమాత్రపు జరిమానా విధించారని ఆరోపించారు. ఇసుక ట్రాక్టర్ వల్ల ఇటీవల తండ్రి కొడుకులు మరణించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసులు, ఉదయ్ కుమార్, మున్న, పఠాన్ ఫరీద్, రామచంద్ర రెడ్డి కూడా పాల్గొన్నారు...


## జాతీయ కరాటే పోటీలకు జగ్గయ్యపేట విద్యార్థులు.

జగ్గయ్యపేట, నిర్భయవార్త ప్రతినిధి ;:. తిరుపతిలో జూన్ 28న నిర్వహించిన



6వ ఏపీ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్-- నేషనల్ సెలక్షన్-2026 పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. బంగారు, వెండి పతకాలు సాధించి వచ్చే నెలలో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించారు.పోటీల్లో దైనిక ఒక బంగారు, ఒక వెండి పతకం, జితేంద్ర ఒక బంగారు పతకం, లోహిత ఒక బంగారు పతకం సాధించారు. విజేతలు జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు.రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయ మని, జాతీయస్థాయిలోనూ మెరుగైన ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, జగ్గయ్యపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ ఎరుగురాల పూజను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అకాడమీ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## చిలకల్లులో 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' ప్రారంభం.



జగ్గయ్యపేట, నిర్భయవార్త ప్రతినిధి ;:.జగ్గయ్యపేట మండలం చిలకల్లు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'వికసిత్ భారత్ -- జీ రామ్ జీ' కార్యక్రమాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రజలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి హామీ పథకంలో పని దినాలను 125 రోజులకు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూలీలకు వేతనాలు నిర్ణీత సమయంలో అందేలా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.గ్రామాల అవసరాలకు అనుగుణంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలు రూపొందించి, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలతో అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకొని అర్హులైన వారంతా వాటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అందరి సహకారంతోనే అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్తినేని అశోక్, నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, అల్లూరి రమణ, దర్శి నరసింహారావు, డేవిడ్, పండు, వరబాబు, మహేష్ తదితరులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దాములూరు ఇసుక రీచ్‌పై మళ్లీ వివాదం.


**లారీలను అడ్డుకున్న గ్రామస్తులు.**
**అక్రమ లోడింగ్‌పై ఆరోపణలు.**



ఇబ్రహీంపట్నం, నిర్భయవార్త ప్రతినిధి :ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దాములూరులో ఇసుక రీచ్ మళ్లీ ప్రారంభం కావడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గురువారం రీచ్ తిరిగి ప్రారంభించడంతో గ్రామస్థులు ఇసుక లారీలనుఅడ్డుకున్నారు.కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి జోగి రమేష్ ఆందోళన నేపథ్యంలో అధికారులు ఈ రీచ్ కార్యకలాపాలను నిలిపివేశారు. అయితే తాజాగా మళ్లీ రీచ్ ప్రారంభించడంతో గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా మెషిన్‌తో ఇసుకను లారీలకు లోడ్ చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. అలాగే రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పేర్కొంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.రీచ్ నిర్వహణ, అనుమతులపై స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

# నందిగామలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు.

**స్థానికుల్లో ఆందోళన.**
**విద్యుత్ వృథాపై ప్రశ్నలు.**



నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :నందిగామ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.సాధారణంగా పగటి వేళల్లో ఆపివేయాల్సిన వీధి దీపాలు నిరంతరం వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, విద్యుత్ వృథాను నివారించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజా దర్బార్ తో సమస్యల పరిష్కారం..

మాజీ కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మహ్మద్ అబ్దుల్ ఖాదర్.

విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి : పశ్చిమ నియోజకవర్గం లోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని మాజీ కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మహ్మద్ అబ్దుల్ ఖాదర్ అన్నారు.. ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ భవానీపురం ,ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు.మాజీ కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు , మహ్మద్ అబ్దుల్ ఖాదర్ కూటమి నేతలతో కలసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.. అనంతరం సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్లో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మహాదేవు అప్పాజీరావు తెలిపారు...



# చెవుటూరులో వీబీజీ రామ్‌జీ పనులకు శ్రీకారం.

**కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభం..**
**గ్రామీణ కార్మికులకు మరింత భరోసా.**



జి.కొండూరు, నిర్భయవార్త ప్రతినిధి :ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరులో వీబీజీ రామ్‌జీ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీబీజీ రామ్‌జీ అమలుతో గ్రామీణ కార్మికులకు మరింత భరోసా కలుగుతుందని అన్నారు.ఉపాధి హామీ పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా కార్మికులకు అదనంగా 25 రోజుల ఉపాధి లభిస్తుందని తెలిపారు. మస్టర్ నమోదు చేసిన 15 రోజుల్లోనే వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలులోఉంటుందని చెప్పారు. వేతనాల చెల్లింపులో ఆలస్యం జరిగితే పరిహారం అందించే నిబంధనను ప్రభుత్వం అమలు చేయనుందని పేర్కొన్నారు.పని కోరిన ప్రతి అర్హుడికి 15 రోజుల్లో ఉపాధి కల్పించడం తప్పనిసరి చేస్తామని, ప్రస్తుతం ఉన్న జాబ్ కార్డుల స్థానంలో గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందికి డిజిటల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, గ్రామీణ రోజ్‌గార్ సహాయక్, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసోసియేట్, మిషన్ ఇంజినీరింగ్ అసోసియేట్ వంటి కొత్త హోదాలు అమల్లోకి వస్తాయని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు సామాజిక తనిఖీలు నిర్వహించి మస్టర్ రోల్స్, చెల్లింపుల వివరాలను బహిరంగపరుస్తామని, ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ రెడ్రెసల్, అంబుడ్స్‌పర్సన్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తున్నాయని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వామి లడ్డు తయారీ కేంద్రంన్ని పట్టించుకోని దేవాదాయ శాఖ.

ఎన్టీఆర్ జిల్లాజగ్గయ్యపేట మండలం,వేదాద్రి గ్రామం,నిర్భయవార్త ప్రతినిధి ;:.రాష్ట్రంలోని ఎంతో ప్రసిద్ధి చెందిన క్షేత్రం అయినా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలోవేంచేసి ఉన్న యోగానంద లక్ష్మి నరసింహ స్వామి





వారి లడ్డు తయారీ కేంద్రంలో దుస్థితి చూస్తే అధ్వానంగా తయారైంది, భక్తులు ఎంతో పవిత్రంగా భావించే స్వామి వారి లడ్డు పోటు అధ్వానంగా ఉన్న పరిసరాలు మధ్య ఉండటం, లడ్డు తయారీదారులు కూడా భక్తితో చేయవలసిన లడ్డును అపవిత్రంగా చేస్తూ స్వామివారి లడ్డుకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారు, ఇంత జరుగుతున్నా కానీ కనీసం దేవాదాయ శాఖ అధికారులు కానీ, ఆలయ వంశం పారపర్య ధర్మకర్త కానీ పట్టించుకోకపోవడం శోచనీయం.

# సర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



సీతారామపురంనిర్భయవార్త ప్రతినిధి :ఓటరు నమోదు ప్రక్రియ సర్ కార్యక్రమానికి బాధ్యత గల ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల టిడిపి యూత్ అధ్యక్షుడు పసుపులేటి వికాస్ బాబు పేర్కొన్నారు. గురువారం సీతారామపురంలోని పడమట వీధి లో బిఎల్వోలు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఓటరు వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు వచ్చేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని బిఎల్ ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షుడు పిడుగు రమేష్, బిఎల్‌ఓ లు ఖాజా మొహిద్దీన్, తమ్మిశెట్టి శిల్ప, టిడిపి బిఎల్ఎ పిడుగు రఘు రాములు పాల్గొన్నారు.

# జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి తో మాజీ మంత్రి నల్లపరెడ్డి భేటీ..



నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి ;:.మాజీ మంత్రివర్యులు, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మరియు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, వీరి చలపతిరావు నేడు జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.

# మాజీ సీఎం గానే ఇంకా జగన్మోహన్ రెడ్డి మిగిలిపోతారు.

**రాజకీయ మేధావులు ముసుగులో అసత్య ప్రచారాలు.**
**అమరావతిని విస్మరించినందుకే వైసీపీ ప్రతిపక్షంలోకి వెళ్ళింది.**
**జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఏపీ ఎమ్మెస్ఎమ్ఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకర్.**



విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి :మాజీ సీఎం గానే ఇంకా జగన్మోహన్ రెడ్డినీ ప్రజలు ఇప్పటికే మర్చిపోయారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఏపీ ఎమ్మెస్ఎమ్ఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకర్ అన్నారు. గురువారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుండి వచ్చినప్పుడల్లా విలేకరుల సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రజలను ఏం మాట్లాడుతున్నారో కూడా అర్థం కాలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. శవ రాజకీయాలకి కేరాఫ్ గా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మారిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ఏనాడు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాత్మకమైన సలహాన్ని ప్రభుత్వానికి ఇప్పటివరకు వైసీపీ ఏమాత్రం అందించలేని పరిస్థితిలో ఉందన్నారు. రాజధాని అమరావతిలో శర వేగంగా నిర్మాణాలు జరుగుతుంటే వైసిపి పార్టీ నాయకులు గుండాలతో కలిసి వెళ్లి ఆ ప్రాంతంలో రాజకీయం చేయాలని చూస్తే, రైతులు స్థానిక ప్రజలే వారిని అడ్డుకున్నారని తెలిపారు. రాజధానిపై జగన్మోహన్ రెడ్డికి అవగాహన లేదు మొదటిగా అమరావతి రాజధాని తాడేపల్లి లోనే నివాసం ఉంటానని మాజీ సీఎం జగన్ చెప్పారు. ఒకసారి వైసీపీకి ప్రజల అధికారం ఇచ్చాక మూడు రాజధానులు అంటూ ఐదు సంవత్సరాలు కాలం గడిపారు.తర్వాత వైసిపి అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలు దాటాక వైజాగ్లో కాపురం ఉంటాను వైజాగ్ లో ఇల్లు కట్టుకున్నాను వైజాగ్ రాజధాని అన్నారు. ఇప్పుడు అధికారం పోయాక మావిగన్ అంటూ మచిలీపట్నం విజయవాడ గుంటూరు అంటూ ప్రజలని మోసం చేస్తున్నారు. రాజధానిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి ఒక అవగాహన లేకుండా ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు.జనసేన పార్టీపై కుట్రలు పన్నేవారిని ఉపేక్షించేది లేదు ప్రస్తుతం జనసేన పార్టీపై కొంతమంది రాజకీయ అవగాహన విశ్లేషకులు రాజకీయ ముసుగులో కొంతమంది యూట్యూబ్ వేదికగా యూట్యూబర్లు కూడా జనసేన పార్టీపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై అసత్య వార్తలు అసత్య ప్రచారాలు చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యం అనే పేరుతో మాట్లాడలేని బూతులు మాట్లాడి రాజకీయాల్లో ఉన్న కుటుంబ సభ్యులపై కూడా విష ప్రచారం చేయడం దారుణం అన్నారు. ప్రజాస్వామ్యంలో వాక్ స్వాతంత్రం ఉందని వ్యక్తిత్వ హననాలు చేస్తూ విష ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వైసిపి నాయకులు మంత్రులు ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నాయకులపై ఏవిధంగా మాట్లాడారో ప్రజలందరూ విన్నారని గుర్తు చేశారు. ఆ భాషలను భరించలేక ప్రజలు 151 సీట్లున్న వైసీపీని 11 కి కుదించి బుద్ధి చెప్పారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా సోషల్ జస్టిస్ కన్వీనర్ అజయ్ కుమార్ వర్మ, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి రావుల రాజేంద్రప్రసాద్, మాచవరం ఆంజనేయస్వామి చైర్మన్ సోడిశెట్టి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏఎస్ పేటలో విబిజి రాంజీ పనులు ప్రారంభం.



ఏఎస్ పేట నిర్భయవార్త ప్రతినిధి ;:. ఏఎస్ పేట మండల కేంద్రలో ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఇజిఎస్) స్థానంలో బివికసిత్ భారత్ -- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) “విబిజి రాంజీ” చట్టాన్ని జులై 1 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి తెచ్చింది.ఈ సందర్భంగా ఏఎస్ పేట మండల కేంద్రంలో ఎంపిడిఓ పి.ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో కేజీబీవీ లో పనులు గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ “గ్రామీణ ప్రజల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు కేంద్రం ఈ నూతన చట్టాన్ని తీసుకొచ్చిందని. విబిజి రాంజీ పథకం కింద ప్రతి అర్హతగల గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 125 రోజుల పని హామీ లభిస్తుంది. దేశవ్యాప్తంగా కనీస వేతనం రోజుకు ?300గా నిర్ణయించారని. ఆంధ్రప్రదేశ్‌లో నూతన వేతనం రోజుకు ?312గా ఉందని.జాతీయ సగటు వేతనం గతంలో ?298.8 ఉండగా, ప్రస్తుతం ?327.4కు పెరిగిందని, ప్రమాద బీమా సదుపాయాన్ని కూడా ?2 లక్షలకు పెంచినట్లు ఆమే వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆమే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మైనార్టీ నాయకులు షేక్ జిలాని భాషా పాల్గొన్నారు. విబిజి రాంజీ ఏపీఓ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ మస్తాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తోటివారి కోసం ...





**వా**రం రోజుల క్రితం వరుస భూకంపాలతో వెనిజులా దేశం చిగురుటాకులా వణికిపోయింది. కారకస్, లాగ్వైరా నగరాల్లో సంభవించిన ఆ పెను విపత్తుకు వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకుపోయారు. అయితే ఇంత బీభత్సం సృష్టించిన భూమి కంపించడం ఆగిపోగానే వెనిజులాలో మరో శక్తి ప్రభంజనంలా కదిలింది. అది.. దేశ ప్రజలు తీవ్ర విషాదంలో ఉన్నప్పుడు పరస్పర సంఘీభావమే వారికి అండగా ఉంటుందని నిరూపించిన శక్తి. ప్రజలే ఆపదలో ఉన్న తోటి వారిని కాపాడారు.

ప్రాపట్రియా మెట్రో స్టేషన్ దగ్గర కాఫీ షాపు నడుపుకునే 66 ఏళ్ల కార్లస్ గుర్రెరో ఆ రోజు తన వ్యాపారం ముగించుకుని ఇంటికి వచ్చాడు. వచ్చిన కొద్దిసేపటికే భూకంపం వచ్చింది. భయంకర శబ్దాలతో, పరుగులు తీస్తున్న ప్రజల హాహాకారాలతో ఆ ప్రాంతమంతా కంపించిపోయింది. కళ్లెదుట భవనాలు కూలిపోతుంటే కార్లస్ తన జీవితం ఇక ముగిసిపోయిందని భావించాడు. ఇంటి పైకప్పు కూలిపోయింది. గోడలు పడిపోయాయి. కంపనాలు ఆగిపోయాక కార్లస్ ఆ శిథిలాల్లో డబ్బు కోసం, వస్తువుల కోసం వెతకలేదు. ముందుగా తన చిలుక బ్రెండాను వెదికాడు. తర్వాత రెండు పెంపుడు కుక్కలు దయానా, ఫ్లాన్ కనిపించాయా అని చూశాడు. చివరికి ఉర్సులా అనే నల్ల పిల్లిని వెతికిపట్టుకున్నాకే అతనికి మనశ్శాంతి కలిగింది. వాటిని పట్టుకుని పరుగులు తీస్తున్న ఆ జనాలతోపాటే కార్లస్ కూడా పరుగెత్తాడు. అందరి చేతుల్లో వారికి చాలా విలువైన వస్తువులు ఉన్నాయి. కార్లస్ చేతుల్లో మాత్రం ఈ మూగ జీవాలు ఉన్నాయి. 'ఇవే నాకు అత్యంత విలువైనవి' అన్నాడు కార్లస్, తనను ఇంటర్వ్యూ చేసిన రిపోర్టర్‌తో. కొన్ని గంటల తరువాత బాధితుల కోసం సిద్ధం చేసిన ఓ పార్కుకు కార్లస్ చేరుకున్నాడు. ఆ రాత్రంతా ఆ ప్రజలకు కంటిమీద కునుకు లేదు. మరుసటి రోజు కార్లస్ అక్కడే ఉన్న ఓ చిన్న రాతిబండ మీద కూర్చుని ఉన్నాడు. అతని చేతుల్లో ఉర్సులా ఉంది. తన షర్టు జేబులో భద్రంగా బ్రెండా కూర్చొని ఉంది. పక్కనే దయానా, ఫ్లాన్ ఉన్నాయి. ఈ మొత్తం దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అయింది. టిక్‌టాక్‌లో లక్షా 20 వేల మందికి పైగా ఆ వీడియోను చూశారు. ఏదైనా సాయం కావాలా అని వారు అడిగినప్పుడు కార్లస్ ఇంకా కష్టాల్లో ఉన్నవారికోసం కదలాలని తన యూజర్లకు సందేశం పంపాడు.



**ప్రభంజనంలా కదిలారు..**

ప్రమాద బాధితులకు అత్యవసర సేవలను అందించేందుకు వెనిజులా అధికారులు సిద్ధమయ్యారు. దేశ విదేశాల ప్రజలు వస్తురూపేణా విరాళాలు అందించారు. వీటన్నింటికంటే ముందే.. వెనిజులా ప్రజలు ఎవరికి వారే ఆపన్నులను ఆదుకోవడానికి నలుదిక్కుల నుంచి కదిలివచ్చారు. సోషల్ మీడియాలో ఫ్రాన్సో పేరుతో పిలవబడే ఓ యువకుడు తన మోటారు సైకిల్ వేసుకుని ప్రమాద స్థలానికి బయల్దేరాడు. బాధితులకు సాయం చేసేందుకు వచ్చే వాలంటీర్లను తన మోటారు సైకిల్‌పై ప్రమాద స్థలానికి ఉచితంగా చేరవేయాలన్నది ఆ యువకుడి లక్ష్యం. ఆ సమయంలో వెనిజులా రహదారులు పెద్ద పెద్ద వాహనాలతో నిండిపోయాయి. వాటినిండా నీళ్లు, పరుపులు, ఆహారం, ఔషధాలు ఉన్నాయి. అవన్నీ ప్రజలు స్వయంగా పంపినవి. లాగ్వైరాకు వచ్చే ఈ వాహనాలతో రోడ్లపై సాధారణ రాకపోకలు స్తంభించిపోయాయి. ఆ స్థాయిలో అక్కడి ప్రజలు బాధితులను అండగా నిలబడ్డారు.

మోటారు వాహనాలు ఒక్క అడుగు కూడా ముందుకు కదిలే పరిస్థితి లేదు. అప్పుడు క్రైడిస్ తన వాహనం నుంచి దిగిపోయి కాలినడకన తన ప్రయాణం కొనసాగించింది. ఆమె ఒక డ్యాన్సర్. ఆ రోజు తన ప్రదర్శనలన్నీ రద్దు చేసుకుంది. బాధితులకు సాయం చేసేందుకు వాలంటీరుగా అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో ప్రశ్నించిన ఓ రిపోర్టర్‌తో ఆమె ఇలా అంది. 'శిథిలాల కింద నుంచి వస్తున్న ఆ అరుపులు ఇంకా సాయం చేసే వారి కోసం ఎదురుచూస్తున్నాయి. అందుకే నేను వెళ్తున్నా.'

**'సునామీ' ప్రత్యేకం!**

అత్యవసర సేవలు అందించిన వెనిజులా ప్రజానీకంలో పైన చెప్పుకున్న వారు కొంతమందే. అయితే ఈ సేవల్లో కీలకంగా పనిచేసిన 'సునామీ' గురించి కూడా చెప్పుకోకపోతే ఇది పరిపూర్ణం కాదు. 'సునామీ' మనిషి కాదు. శునకం. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొని 300 మందికి పైగా ప్రజలను కాపాడింది. తన వయసు 9 ఏళ్లు. వీధిలో తిరిగే తనను చాలా ఏళ్ల క్రితం కొంతమంది రక్షించి రెస్క్యూ వాళ్లకు అప్పగించారు. దానికి ఇచ్చిన ఓ అవకాశం ఇప్పుడు వందల మంది ప్రాణాలను రక్షించడానికి తోడ్పడింది. సునామీతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్క రెస్క్యూ డాగ్ శిథిలాల మధ్య తిరుగుతూ చేసిన ఒక్కో అరుపు, ఒక్కో సంకేతంలా పనిచేసింది. రాళ్లపై గోళ్లతో అవి చేసిన ప్రతి సంజ్ఞ బాధితుల ప్రాణాలను మరణం నుంచి రక్షించింది.

చాలా విషాదాల్లో మరణాలు, గాయాలు, కుప్పకూలిన భవనాల సంఖ్యను లెక్కిస్తారు. అధికారిక లెక్కల్లో అరుదుగా కనిపించే మరో గణాంకం కూడా అక్కడి మనుషుల స్పందనే. కష్టాల్లో ఉన్నవారికి బాసటగా తోటి ప్రజలే కదులుతారు. తమ సమయాన్ని, శ్రమను అందిస్తారు. వెనిజులాలో ఇప్పుడు ఇలాంటి దృశ్యమే కనిపిస్తోంది.

*** 'టెలిసూర్' సౌజన్యంతో..**

## పానిక్ అటాక్, గుండె పోటు..
## రెండింటికీ లక్షణాలు ఒకే విధంగా ఉంటాయా.. ఏం చేయాలి..?

ఆందోళన, ఒత్తిడి పెరిగిన సమయంలో ఛాతిలో నొప్పి, చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, చేతులు మొద్దుబారినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే చాలామంది గుండెపోటు వచ్చిందేమోనని భయపడతారు. అయితే ఇలాంటి లక్షణాలు పానిక్ అటాక్ సమయంలో కూడా కనిపిస్తాయి. దీంతో పానిక్ అటాక్ వల్ల నిజంగానే గుండెపోటు వస్తుందా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తుల్లో ఒక్కసారి వచ్చే పానిక్ అటాక్ వల్ల నేరుగా గుండెపోటు వచ్చే అవకాశం చాలా తక్కువ. పానిక్ అటాక్, గుండెపోటు రెండింటిలోనూ ఛాతి నొప్పి, చెమటలు పట్టడం, చేతుల్లో తిమ్మిరి లేదా మొద్దుబారిన భావన, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందుకే ఈ రెండు పరిస్థితులను చాలామంది వేరు చేయలేకపోతారు. ఛాతి నొప్పితో అత్యవసర విభాగానికి వెళ్లే వారిలో ఇలాంటి సందేహాలు తరచూ వస్తుంటాయి.



**కారణాలు భిన్నంగానే..**

అయితే ఈ రెండు సమస్యలకు కారణాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. గుండెపోటు సాధారణంగా గుండెకు రక్తాన్ని సరఫరా చేసే కరోనరీ ధమనుల్లో అడ్డంకి ఏర్పడడం వల్ల వస్తుంది. కానీ పానిక్ అటాక్ సమయంలో శరీరంలో ఒత్తిడి హార్మోన్లు ఒక్కసారిగా అధికంగా విడుదల కావడం వల్ల ఈ లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల లక్షణాలు ఒకేలా ఉన్నప్పటికీ, వాటి వెనుక ఉన్న కారణాలు వేర్వేరుగా ఉంటాయి. ఒక్కసారి వచ్చే పానిక్ అటాక్ వల్ల ఆరోగ్యకరమైన గుండెకు సాధారణంగా పెద్ద ప్రమాదం ఉండదు. అయితే తరచూ పానిక్ అటాక్‌లు రావడం, దీర్ఘకాలిక ఆందోళన, మానసిక ఒత్తిడి కొనసాగడం వల్ల కాలక్రమేణా గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది.

**దీర్ఘకాల ఒత్తిడి ఉంటే..**

దీర్ఘకాలం కొనసాగే ఒత్తిడి, ఆందోళన గుండెపై అదనపు భారం మోపి హృదయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అయినప్పటికీ ఆరోగ్యకరమైన గుండె సాధారణంగా ఒక పానిక్ అటాక్‌ను తట్టుకోగలదని నిపుణులు చెబుతున్నారు. అయితే తరచూ పానిక్ అటాక్‌లు వస్తుంటే వాటిని నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. ఛాతి నొప్పి, చెమటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చేతులకు నొప్పి లేదా తిమ్మిరి వంటి లక్షణాలు కనిపించినప్పుడు అది పానిక్ అటాకా, గుండెపోటా అనే విషయాన్ని ఇంట్లోనే నిర్ణయించేందుకు ప్రయత్నించకూడదు. ఎందుకంటే ఈ రెండింటి మధ్య తేడాను వైద్య పరీక్షల ద్వారానే కచ్చితంగా నిర్ధారించగలుగుతారు. అందువల్ల ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యంత సురక్షితమైన మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

## కాఫీని సేవిస్తే మైగ్రేన్ తగ్గుతుందా,
## పెరుగుతుందా.. నిపుణులు ఏమంటున్నారు..?

ఆధునిక జీవనశైలిలో మైగ్రేన్ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మైగ్రేన్ తలనొప్పి వచ్చినప్పుడు కాఫీ తాగితే ఉపశమనం లభిస్తుందని కొందరు చెబుతుంటే, మరికొందరు మాత్రం కాఫీనే మైగ్రేన్‌కు కారణమవుతుందని భావిస్తారు. దీంతో కాఫీ నిజంగా మైగ్రేన్‌కు మేలు చేస్తుందా? లేక హాని చేస్తుందా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం దీనికి ఒకే సమాధానం ఉండదు. వ్యక్తి నుంచి వ్యక్తికి కాఫీ ప్రభావం మారుతుంది. కాఫీలో ఉండే కెఫీన్ మెదడులోని అడెనోసిన్ రిసెప్టర్లను నిరోధించి రక్తనాళాలు కుచించుకునేలా చేస్తుంది. మైగ్రేన్ సమయంలో మెదడులోని రక్తనాళాలు విస్తరించడం వల్ల నొప్పి పెరుగుతుంది. అలాంటి సమయంలో కెఫీన్ రక్తనాళాలను మళ్లీ కుచించడంలో సహాయపడటంతో కొందరిలో తలనొప్పి తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే కొన్ని తలనొప్పి నివారణ మందుల్లో కూడా కెఫీన్‌ను ఉపయోగిస్తారు.



**భిన్న రకాలుగా ప్రభావం..**

అయితే ప్రతి మైగ్రేన్ బాధితుడికి కాఫీ ఒకే విధంగా పనిచేయదు. కొందరిలో కాఫీ తాగిన వెంటనే మైగ్రేన్ దాడి ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి వారు కాఫీని దూరంగా ఉంచడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు ప్రతిరోజూ ఎక్కువగా కాఫీ తాగే వారు ఒక్కసారిగా కాఫీ తగ్గిస్తే లేదా పూర్తిగా మానేస్తే కూడా తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. దీనిని కెఫీన్ ఉపసంహరణ తలనొప్పి అంటారు. అంటే కాఫీ తాగడం వల్ల కాదు, ఒక్కసారిగా తాగడం ఆపేయడం వల్ల కూడా తలనొప్పి వస్తుంది. నిపుణుల సూచనల ప్రకారం, కాఫీ తాగిన తర్వాత మైగ్రేన్ వస్తే దానిని నివారించడం ఉత్తమం. అయితే కాఫీ తాగని రోజుల్లో మాత్రమే తలనొప్పి వస్తే అది కెఫీన్ ఉపసంహరణ ప్రభావం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కసారిగా కాఫీ మానేయకుండా క్రమంగా తగ్గించడం మంచిది.




# అతిలోక సుందరి గర్వించేలా జాన్వీ కోలీవుడ్ డెబ్యూ?

ఒకసారి గతంలోకి వెళ్తే.. జాన్వీ తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి కోలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆరంగేట్రాన్ని అందుకున్నారు. అతిలోక సుందరి, దివంగత శ్రీదేవి తనయగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ఇప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమపై గట్టిగానే దృష్టి సారించింది. ఇప్పటికే తన తల్లికి ఎంతో ఇష్టమైన టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ, ఇక్కడ వరుసగా రెండు పెద్ద సినిమాలతో భారీ విజయాలను దక్కించుకుంది. ఎన్టీఆర్ సరసన దేవర ఘనవిజయం సాధించగా, రామ్ చరణ్ స్పోర్ట్స్ డ్రామా -పెద్ది- బాక్సాఫీస్ వద్ద విజయం అందుకుంది. తెలుగులో సాధించిన సక్సెస్ జోష్‌తో ఇప్పుడు తమిళ పరిశ్రమ (కోలీవుడ్) పై కన్నేసినట్లు తెలుస్తోంది. తమిళంలో ఈ యంగ్ బ్యూటీ ఎంట్రీ ఇవ్వబోతోందనే వార్తలు ఇండస్ట్రీ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్ లో వినిపిస్తున్న కథనాల ప్రకారం.. ప్రముఖ దర్శకుడు పా రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై..దర్శకుడు సర్గుణం తెరకెక్కించనున్న -కురత్తి- అనే వెబ్ సిరీస్ ద్వారా జాన్వీ కపూర్ తమిళంలోకి అడుగుపెట్టబోతోందని ప్రచారం సాగుతోంది. ఇందులో జాన్వీ ప్రధాన పాత్రలో నటిస్తుందని కథనాలొస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుండి కానీ.. జాన్వీ నుండి కానీ ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. ఒక వెబ్ సిరీస్ తో జాన్వీ కోలీవుడ్ డెబ్యూ ఉండబోతోందనే వార్త ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తిని కలిగించడమే కాదు.. కొంత ఆందోళనను రేకెత్తిస్తోంది.ఒకసారి గతంలోకి వెళ్తే.. జాన్వీ తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి కోలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆరంగేట్రాన్ని అందుకున్నారు. 1967లో వచ్చిన -కందన్ కరుణై- అనే భక్తిరస చిత్రంలో కేవలం నాలుగేళ్ల వయసులోనే చైల్డ్ ఆర్టిస్ట్‌గా వెండితెరకు పరిచయమైన శ్రీదేవి.. ఆ తర్వాత 1976లో లెజెండరీ డైరెక్టర్ కె. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ థ్రిల్లర్ -మూండ్రూ ముడిచ్చు- చిత్రంతో 13 ఏళ్ల వయసులోనే హీరోయిన్‌గా అరంగేట్రం చేశారు. అంతటి గొప్ప దర్శకుడితో కెరీర్ ప్రారంభించే అవకాశం శ్రీదేవికి దక్కింది.. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో జాన్వీ కపూర్‌కు అలాంటి ఒక లెజెండరీ డైరెక్టర్‌తో డెబ్యూ ఛాన్స్ సాధ్యపడేలా కనిపించడం లేదు



# నేచురల్ స్టార్ ఫోటో కలకలం.. అసలేమైంది?



తాజాగా నేచురల్ స్టార్ నాని సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఇండస్ట్రీ వర్గాలతో పాటు అభిమానుల్లోనూ తీవ్ర కలకలం రేపుతున్నాయి. టాలీవుడ్ అగ్ర హీరోలు సినిమా స్క్రిప్ట్ డిమాండ్ చేస్తే గాయాలను కూడా ఖాతరు చేయక రిస్కీ స్టంట్స్ చేయడానికి వెనకాడటం లేదు. ఇటీవల -పెద్ది- ప్రమోషన్స్ లో రామ్ చరణ్ ని చేతికి కట్టుతో చూసాం. పెద్ది సెట్లో తన చేతికి తీవ్ర గాయమే అయినా దానిని కూడా అతడు గిఫ్ట్ అని భావించారు. సినిమా ఔట్ పుట్ చూశాక దీనిని మర్చిపోయానని చెప్పారు. చరణ్ గాయాన్ని చూసి మెగాస్టార్ చిరంజీవి కూడా ఎంతగానో కంగారు పడ్డారు. తన పాత రోజులను గుర్తు చేసుకున్నారు. తాజాగా నేచురల్ స్టార్ నాని సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఇండస్ట్రీ వర్గాలతో పాటు అభిమానుల్లోనూ తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఆ ఫోటోగ్రాఫ్స్‌లో నాని ఎడమచేతి మోచేతికి పెద్ద బ్యాండేజ్ కట్టి ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల చరణ్ చేతి గాయంతో కనిపించి ఫ్యాన్స్‌ను కంగారు పెట్టగా.. ఇప్పుడు నాని చేతికి ఉన్న కట్టును చూసి అభిమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది -హిట్ 3- చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకొని ఫుల్ జోష్‌లో ఉన్న నాని.. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో -ది ప్యారడైజ్- అనే హై-వోల్టేజ్ యాక్షన్ మూవీలో నటిస్తున్నారు. అయితే ఈ గాయం ఎక్కడ అయింది... ఎలా అయింది? అనే విషయంపై నాని ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కానీ.. ఫోటోలను షేర్ చేస్తూ.. బాలీవుడ్ క్లాసిక్ డైలాగ్ -గాయల్ హూ.. ఇస్లీయే ఘూతక్ హూ- (గాయపడ్డాను.. అందుకే మరింత ప్రమాదకరంగా మారాను) అంటూ క్యాప్షన్ ఇవ్వగా అది అంతర్జాలంలో దుమారంగా మారింది. గాయం తీవ్రతపై క్లారిటీ లేకపోవడంతో.. నానిని ట్యాగ్ చేస్తూ అసలు ఏమైందంటూ ఫ్యాన్స్ ఆరా తీస్తున్నారు. నిజానికి గత రెండేళ్లుగా (2025-26 సీజన్) టాలీవుడ్‌లో హీరోలు వరుసగా గాయాల బారిన పడటం ఒక రొటీన్ వ్యవహారంలా.. ఆందోళనకర విషయంగా మారింది. వెండితెరపై సరికొత్త యాక్షన్ విజువల్స్ చూపించే క్రమంలో డూప్స్ లేకుండా ఫైట్స్ చేస్తుండటంతో స్టార్ హీరోలందరూ బెడ్ రెస్ట్ తీసుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. రామ్ చరణ్‌తో పాటు ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి స్టార్లు సైతం తమ పాన్ ఇండియా చిత్రాల షూటింగ్స్ సమయంలో వేర్వేరు సందర్భాల్లో గాయపడి ఫ్యాన్స్‌కు టెన్షన్ పుట్టించారు. షూటింగ్స్ శరవేగంగా పూర్తి చేయాలనే ఒత్తిడిలో హీరోలు తమ శారీరక శ్రమను లెక్కచేయకుండా కష్టపడటమే దీనికి ప్రధాన కారణం.ఈ గాయాల పర్వం కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాలేదు. గతంలో బాలీవుడ్, కోలీవుడ్ పరిశ్రమల్లోని టాప్ స్టార్లు సైతం యాక్షన్ సీక్వెన్స్‌ల వల్ల తీవ్రంగా దెబ్బలు తిన్నారు. బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ వంటి అగ్ర నటులు భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్స్ చేస్తున్నప్పుడు ప్రమాదాలకు గురవగా.. కోలీవుడ్‌లో అజిత్ కుమార్, సూర్య వంటి స్టార్లు కూడా షూటింగ్ స్పాట్‌లలో గాయపడి కొన్ని వారాల పాటు షూటింగ్‌లకు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. వెండితెరపై ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించడం కోసం హీరోలు పడుతున్న శ్రమ.. ఎదుర్కొంటున్న ప్రమాదాలకు ఈ గాయాలే నిదర్శనం.ప్రస్తుతం జూలై నెలను విభిన్నంగా ప్రారంభించిన నేచురల్ స్టార్ నాని.. తన తదుపరి భారీ యాక్షన్ మూవీ షెడ్యూల్‌లో జాయిన్ అవ్వబోతున్నట్లు తెలుస్తోంది. చేతికి దెబ్బ తగిలినా తగ్గని కసితో అతడు పెట్టిన క్యాప్షన్ చూస్తుంటే.. -ది ప్యారడైజ్- కోసం ఎంతలా ప్రాణం పెడుతున్నారో అర్థమవుతోంది. ఏదేమైనా సోషల్ మీడియా వేదికగా అభిమానులు నాని త్వరగా కోలుకోవాలని -గెట్ వెల్ సూన్- అంటూ మెసేజ్‌లు పెడుతున్నారు. మరి ఈ గాయం వెనుక ఉన్న అసలు కథేంటో.. తన హెల్త్ కండిషన్ ఎలా ఉందో నాని స్వయంగా స్పందించి క్లారిటీ ఇచ్చే వరకు అభిమానుల్లో ఈ టెన్షన్ ఇలాగే కొనసాగేలా ఉంది.

# సత్తా చాటుతున్న యువ భామలు!



టాలీవుడ్ పరిశ్రమలో ప్రతిభకు కొదవ లేదు. మారుతున్న కాలంతో పాటు యువ నటీమణులు కూడా సరికొత్త ఉత్సాహంతో దూసుకుపోతున్నారు. టాలీవుడ్ పరిశ్రమలో ప్రతిభకు కొదవ లేదు. మారుతున్న కాలంతో పాటు యువ నటీమణులు కూడా సరికొత్త ఉత్సాహంతో దూసుకుపోతున్నారు. కయాదు లోహర్, మమిత బైజు, ప్రీతి ముకుందన్ వంటి యువ భామలు నటనతో, గ్లామర్‌తో ప్రేక్షకులను అలరిస్తూ కెరీర్‌లో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు కొత్త హీరోయిన్లకు అవకాశాలు దక్కడం ఎంత కష్టమో? ఇప్పుడు వారికి అవకాశాల వరద పారడం అంతే ఆశ్చర్యకరంగా మారింది. ఈ జాబితాలో ముందుగా చెప్పుకోవాల్సింది కయాదు లోహర్ గురించి. నాని నటిస్తో భారీ చిత్రం -ది పారడైస్- లో అవకాశం దక్కించుకోవడం అమ్మడి కెరీర్‌లో పెద్ద మలుపు. ఈ ప్రాజెక్టే కాకుండా కయాదు మరికొన్ని క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంది. అమ్మడు స్క్రీన్ ప్రెజెన్స్‌తో, నటనలోని సహజత్వంతో దర్శకుల దృష్టిని ఆకర్షించడంలో సొగసరి సక్సెస్ అయ్యింది. రాబోయే కాలంలో ఈ భామ స్టార్ హీరోయిన్ రేంజ్‌కు వెళ్లడం ఖాయమని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మలయాళ చిత్ర పరిశ్రమ నుండి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన మమిత బైజు కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపును దక్కించుకుంది. క్యూట్ లుక్స్, నటనలోని పరిణతితో తెలుగు , తమిళ భాషల్లో మంచి ప్రాజెక్ట్‌లను సొంతం చేసుకుంటోంది పాత్ర ఏదైనా అందులో? ఒదిగిపోవడానికి అమ్మడు చూపే ఆసక్తి వరుస అవకాశాలను తెచ్చిపెడుతోంది. మల్టీ-లింగ్యువల్ సినిమాల్లో మెరుస్తూ తనదైన మార్కును వేస్తోంది. ప్రీతి ముకుందన్ కూడా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులకు దగ్గరవుతోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాముఖ్యత ఉన్న చిత్రాలను ఎంచుకోవడం కెరీర్‌కు బాగా కలిసొస్తోంది. తెలుగు, తమిళ భాషల్లో ఆమెకున్న క్రేజ్ అంతకంతకు రెట్టింపు అవుతోంది. నటనతో దర్శకుల వద్ద నటిగా మంచి పేరు తెచ్చుకుంటోంది. దీంతో స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు సులభమవుతున్నాయి. ఈ భామలు అందాల తారలుగానే కాకుండా పర్ఫార్మెన్స్ ఓరియంటెడ్ పాత్రల వైపు మొగ్గు చూపడం విశేషం.

# మొత్తానికి జన నాయగన్ సెన్సార్ పూర్తి? విడుదల ఎప్పుడంటే!?




తమిళనాడు సీఎం అలాగే దళపతి విజయ్ హీరోగా నటించిన ఆఖరి సినిమానే జన నాయగన్. తెలుగులో జన నాయకుడు పేరిట ప్లాన్ చేసిన ఈ సినిమాని దర్శకుడు హెచ్ వినోద్ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అనేది పెద్ద ప్రశ్నగా మారగా అభిమానులు విజయ్ సీఎం అయ్యాక త్వరగానే విడుదల ఉంటుంది అని భావించారు. కానీ తను సీఎం అయ్యిన తర్వాత కూడా సస్పెన్స్ తప్పలేదు.దీనికి ప్రధాన కారణం సినిమా సెన్సార్ కాకపోవడం. కానీ ఇప్పుడు ఎట్టకేలకు సెన్సార్ ని సినిమా పూర్తి చేసుకున్నట్టు తెలుస్తోంది. మేకర్స్ ముందు నుంచీ కోరుకున్న ఏ సర్టిఫికెట్ నే జన నాయగన్ పొందినట్టు తమిళ సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక విడుదల విషయానికి వస్తే దాదాపు ఈ జులై లోనే ఉంటుందట. లేదా ఆగస్ట్ కి షిఫ్ట్ అవుతుంది అని తెలుస్తోంది. సో దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందిస్తున్నాడు అలాగే కే వి ఎన్ సంస్థ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

# 'నాగబంధం' ఇంటర్వెల్ ఇచ్చే హై మామూలుగా ఉండదట..!




అభిషేక్ నామా దర్శకత్వంలో రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన మైథలాజికల్ అడ్వెంచర్ 'నాగబంధం' జూలై 3న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది. సినిమాపై ఉన్న భారీ క్రేజ్ కారణంగా జూలై 2నే ఓవర్సీస్‌తో పాటు పలు చోట్ల ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇక రీసెంట్‌గా జరిగిన ప్రెస్ మీట్‌లో చిత్ర యూనిట్ సినిమా విజయంపై పూర్తి ధీమాను వ్యక్తం చేసింది. హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ.. శివుడిని, దర్శకుడిని నమ్మి ఈ ప్రాజెక్ట్ కోసం తన బెస్ట్ ఇచ్చానని, విజువల్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయని తెలిపాడు.భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు అభిషేక్ నామా పేర్కొన్నాడు. నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ.. అవుట్‌పుట్ చూశాక తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, కథనం, అపూర్వమైన విజువల్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని.. ఇంటర్వెల్ ఇచ్చే హై మామూలుగా ఉండదంటూ చెప్పుకొచ్చారు.

# బాక్సాఫీస్ షేక్ చేసేందుకు రిషబ్ మాస్టర్ ప్లాన్.. 'కాంతార' రేంజ్ కలెక్షన్లే టార్గెట్!

-కాంతార- చిత్రంతో ఓవర్ నైట్ గ్లోబల్ స్టార్‌గా మారిన రిషబ్ శెట్టి ప్రణాళికలు ఇప్పుడు సినీపరిశ్రమల్లో చర్చగా మారాయి. -కాంతార- చిత్రంతో ఓవర్ నైట్ గ్లోబల్ స్టార్‌గా మారిన రిషబ్ శెట్టి ప్రణాళికలు ఇప్పుడు సినీపరిశ్రమల్లో చర్చగా మారాయి. ఒకే ఒక్క ఫ్రాంచైజీతో బాక్సాఫీస్ వద్ద తన మార్కెట్‌ను పాన్ ఇండియా రేంజుకు చేర్చిన ఘనత అతడిది. కేవలం 125 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన కాంతార ప్రీక్వెల్(కాంతార 2), థియేట్రికల్ రన్‌లో ఏకంగా 852 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి 2025లో టాలీవుడ్, బాలీవుడ్ చిత్రాలను అధిగమించి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. మొదటి భాగం సాధించిన 407.82 కోట్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లను ఇది డబుల్ మార్జిన్‌తో బ్రేక్ చేసింది. ఫ్రాంఛైజీలో రెండు సినిమాలతో 1250 కోట్ల రేంజు హీరోగా ఎదిగాడు. ఇప్పుడు ఇదే జోష్‌తో తన తదుపరి హిస్టారికల్ ప్రాజెక్ట్ -ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్- కోసం రిషబ్ ఒక భారీ మాస్టర్ ప్లాన్ తో ముందుకు సాగుతున్నారు.రిషబ్ శెట్టి కేవలం ఒకే భాగంతో ముగించకుండా... ఈ చారిత్రాత్మక కథను రెండు భాగాలుగా (టూ-పార్ట్ సాగా) ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నారని తెలుస్తోంది. -కాంతార- ఫ్రాంఛైజీ తరహాలోనే ఈ రెండు భాగాల స్ట్రాటజీతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద వండర్స్ క్రియేట్ చేయవచ్చని రిషబ్ నమ్ముతున్నారు. శివాజీ మహారాజ్ జీవితంలోని శౌర్యాన్ని, వీరత్వాన్ని ఒకే భాగంలో చూపించడం సాధ్యం కాదు కాబట్టే రిషబ్ స్వయంగా ఈ కథను విస్తరించి భారీ క్యాన్వాస్‌పై రెండు భాగాలుగా ప్లాన్ చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏకంగా 500 కోట్లకు పైగా భారీ బడ్జెట్ కేటాయించడం ఒక సంచలనం. విజువల్స్ పరంగా, యాక్షన్ సీక్వెన్స్ పరంగా ఇండియన్ స్క్రీన్‌పై ముందెన్నడూ



చూడని భారీతనాన్ని చూపించబోతున్నారని తెలుస్తోంది. కథలో వచ్చే అద్భుతమైన ట్విస్టులతో పాటు, అన్ని భాషల ప్రేక్షకులను కనెక్ట్ చేయడానికి వీలుగా పాన్-ఇండియా స్టార్ కాస్టింగ్‌ను సెట్ చేస్తున్నారు. వివేక్ ఒబెరాయ్, షెఫాలీ షా వంటి పవర్‌ఫుల్ నటీనటులు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం సినిమా రేంజ్‌ను మరింత పెంచింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు నేషనల్ అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ -అమిత్ త్రివేది- సంగీత దర్శకుడిగా యాడ్ అవ్వడం సినిమాకు అతిపెద్ద అసెట్‌గా మారింది. నిజానికి ప్రీతమ్ ని తొలుత ఎంచుకున్నా, ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల ఆ స్థానంలో అమిత్ త్రివేది చేరారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197